ప్రజావీక్షణం
విలేకర్లు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో
ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ
ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా.?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా.?
అయితే రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా
జిల్లాలు, మండలాల వారీగా నిబద్ధతతో
పని చేసే విలేకరులు కావలెను
PJV ప్రజా వీక్షణం టీవి
9866330400


# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్


PJV
ప్రజా వీక్షణం టీవి
Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :154 28 మంగళవారం, ఏప్రిల్ 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari



## మహిళల భద్రతకు
# ప్రభుత్వం పెద్దపీట

- మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం
- మహిళలను అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలిపాం
- మహిళాభివృద్ధికి తెలంగాణ బ్రాండ్ కావాలి
- గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నాం
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు
- అన్నిరంగాల్లో మహిళా రిజర్వేషన్ల కాంగ్రెస్ ఘనతే
- స్పందన బృందాల ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్


2 లో

## ఏడుగురు ఆప్ ఎంపీల
# విలీనానికి రాజముద్ర

- వీరంతా బిజెపిలో చేరినట్లుగా గుర్తించిన ఛైర్మన్
- రాజ్యసభలో 113 కు చేరిన బిజెపి సంఖ్యాబలం

న్యూఢిల్లీ,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో విలీనమవ్వడానికి రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో రాజ్యసభలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ విలీనంతో బీజేపీ సంఖ్యాబలం 113కి పెరిగింది. మిగతా 2 లో



## ఎన్నికల్లో 'మా-మాటి-మానుష్' దే విజయం

- విభజన శక్తులను తిప్పికొట్టాల్సిన అవసరం ఇదే
- బెంగాల్ ప్రజలను కోరిన సిఎం మమతా బెనర్జీ

కోల్‌కతా,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)




పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 'మా–మాటి–మానుష్' (తల్లి, నేల, ప్రజలు) విజయం ఖాయమని ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బెంగాల్ సంస్కృతి, వారసత్వాన్ని రక్షించుకోవాలని, విభజన శక్తులను తిప్పికొట్టాలని ఓటర్లను కోరారు. 'మా–మాటి–మానుష్ ఇక అంచనాలకు సంబంధించిన విషయం కాదు, కాలమే సమాధానమిస్తుంది' అని అన్నారు. ఆదివారంనాడు తాను జరిపిన పాదయాత్రకు విశేషంగా స్పందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రెండో విడత ఎన్నికల ప్రచారానికి సోమవారం సాయంత్రం 6 గంటలకు తెరపడనుండటంతో సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రజలను ఉద్దేశించి మమతాబెనర్జీ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. మిగతా 2 లో

## కోర్టుపై తనకు నమ్మకం పోయింది

- అందుకే మీరు ఉన్నంత వరకు హాజరు కాను
- ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిపై కేజ్రీవాల్ వ్యాఖ్యలు
- ఈ మేరకు లేఖ విడుదలచేసిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)




ఢిల్లీ మద్యం విధానం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజీ్రవాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసును విచారిస్తున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఎదుట హాజరుకావ డానికి ఆయన నిరాకరించారు. ఈ మేరకు ఆయన న్యాయమూర్తికి ఒక లేఖ రాస్తూ, కోర్టుపై తనకు 'నమ్మకం పోయిందని' సంచలన వ్యాఖ్యలు చేశారు.

## రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యం

- విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గించేలా చర్యలు
- విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి,ఏప్రిల్27(ప్రజా వీక్షణం)



విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. యూనిట్ ధరను రూ.4.60కు తగ్గించేలా కసరత్తు చేస్తోంది. సోమవారం నాడు విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులకు సీఎం కీలక సూచనలు చేశారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన

- తీవ్ర సంక్షోభంలో రాష్ట్ర వ్యవసాయ రంగం
- రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు అధ్వాన్నం
- పంట కొనుగోళ్ల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి
- ప్రజా సమస్యలపై ఇక నుంచి ఉధృతంగా పోరాటం

మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




హైదరాబాద్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.వీటిపై రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించామని తెలిపారు. ప్రతి ప్రజా సమస్యను ఐడెంటిఫై చేస్తామని పేర్కొన్నారు.

## పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ ప్రాంగణం

- సెంట్రల్ హాలును త్వరగా పూర్తి చేయాలి
- పబ్లిక్ గార్డెన్‌లో సభ్యులకు క్లబ్ ఏర్పాటు
- స్పీకర్, మండలి చర్మన్‌తో సిఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)



అసెంబ్లీ ప్రాంగణం పార్లమెంట్ తరహాలో పనితీరు ఉండేలా అవసరమైన మార్పులు చేపట్టాల్సి ఉందని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో చేపట్టాల్సిన పనులపైన శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మిగతా 2 లో

## ఎమ్మెల్సీలుగా కోదండరామ్,అజారుద్దీన్ ప్రమాణం

- ప్రమాణం చేయించిన మండలి ఛైర్మన్ గుత్తా
- హాజరైన సిఎం రేవంత్ తదిరులు

హైదరాబాద్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.



మిగతా 2 లో

## బెంగాల్ ప్రచారం ముగించిన ప్రధాని

- 29న రెండో విడత ఎన్నికలు
- బిజెపి అధికారంలోకి వస్తున్న మోడీ
- మళ్లీ సిఎం ప్రమాణానానికి వస్తానంటూ వెల్లడి

కోల్‌కతా,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

బెంగాల్‌లో ఎన్నికల ప్రచారం ముగిసింది. 29న రెండోవిడత ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో 27న సాయంత్రం ప్రచారం ముగిసింది. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి. ఈ క్రమంలో ప్రధాని మోడీ ప్రచారం ముగిసంది. భాజపా అధికారంలోకి వస్తుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో నేడు చివరి ర్యాలీలో పాల్గొన్నానని..మళ్లీ బెంగాల్‌లో భాజపా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్రానికి తిరిగి వస్తానని ఆశిస్తున్నట్లు తెలిపారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామన్నారు. అదే ఉత్సాహంతో నేడు తాను వెళ్తున్నట్లు పేర్కొన్నారు.


మిగతా 2 లో

# మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు, చిన్నారులకు రక్షణ మొదటి ప్రాముఖ్యతగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏ దేశంలో, నగరంలో వీరికి రక్షణ ఉంటుందో.. అక్కడ అభివృద్ధి ఎక్కువగా జరుగుతుందన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో స్పందన బృందాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతకు పెద్దపీట వేసింది. గతంలో షీ టీమ్స్ ఏర్పాటు చేస్తే.. 'స్టాండ్ విత్ హర్' అని ప్రత్యేక కార్యక్రమం చేపట్టాం. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ పోలీసులు స్పందన పేరుతో మరో కార్యక్రమం తీసుకొచ్చారు. వారికి తక్షణ రక్షణ కోసం ఈ టీమ్స్ పని చేస్తాయి. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ముందుంది అని చెప్పేందుకే నేను ఈ కార్యక్రమానికి హాజరయ్యానని సీఎం అన్నారు. అమెరికా లాంటి దేశాల్లోనే మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు ఎన్నో ఏళ్లు పట్టింది. స్వాతంత్ర్యం రాగానే భారత్‌లో మహిళలకు నెహ్రూ సమాన హక్కు కల్పించారు. ఇప్పుడు అన్ని రంగాల్లో మహిళలు ఉన్నత స్థాయిల్లో ఉన్నారు. కానీ ఇంకా కొన్ని చోట్ల వారిపై వివక్ష ఉంది. కానీ మనదేశంలో దేశ ప్రధాని గా, లోక్ సభ స్పీకర్ గా, రాష్ట్రాల గవర్నర్లు, న్యాయమూర్తులు గా మహిళలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చింది..మహిళా విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లతో పాటు స్థానిక సంస్థల్లో కూడా మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చి పరిపాలన లో కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యం చేసిందన్నారు. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ల కోసం 2013 లోనే బిల్లును కాంగ్రెస్ ఆమోదించిందని గుర్తు చేశారు.

ఇప్పటికి కొన్ని విషయాల్లో మహిళలపైన వివక్ష ఉంది.. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే మహిళలకు రక్షణ కల్పించాలి, పిల్లలకు భద్ర త ఇవ్వాలని మా ప్రభుత్వం భావించిందన్నారు. స్పందన ద్వారా తక్షణమే బాధిత మహిళలకు మానసిక భద్రత కల్పిస్తారు.. సమస్య వచ్చినప్పుడు నా పక్కన నిలబడుతుందన్న విశ్వాసాన్ని మా ప్రభుత్వం కల్పిస్తోంది.. తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న సందేశం ఇవ్వడం కోసం నేను ఈ కార్యక్రమంలో పాల్గొన్నాను.. సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించడం కాదు.. అసలు సమస్యనే రాకుండా చూడాల్సిన సామాజిక బాధ్యత మనపైన ఉందన్నారు. మహిళల బాధలో అండగా నిలబడి ధైర్యాన్ని ఇచ్చే సామాజిక బాధ్యత అందరిపైన ఉందని, ప్రభుత్వ ప్రతి సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలకు పెద్ద పీట వేస్తున్నాం అని వివరించారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళలపేరుతో ఇస్తున్నాం.. మహిళకు ఆర్థిక స్వాలంభన వచ్చినప్పుడు కుటుంబం సమాజంలో నిలబడుతుంది..మహిళా సాధికారిత ను అమలు చేయడం ముఖ్యం.. 67 లక్షల మంది స్వయం సహాయక మహిళా సంఘాలకు 60 వేల కోట్ల రూపాయల బ్యాంక్ రుణాలను అందజేశాం..

రాష్ట్రంలోని కోటీ మంది మహిళలకు సారె పేరుతో ఇందిరమ్మ చీరలు ఇచ్చాం.. 28 నెలల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం 10 వేల కోట్లు ఖర్చు చేసింది.. ఉచిత బస్సు ప్రయాణాన్ని పకడ్బందీగా అమలు చేయడం వల్ల ఆడబిడ్డలకు 10 వేల కోట్లు ఆదా చేసుకున్నారు.. స్వయం సహాయక సంఘాలకు 1000 బస్సులను కొనిచ్చి ఆర్టీసీకి లీజు ఇప్పించాం.. 1000. మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్ల ను స్వయం సహాయక మహిళలకు ఇప్పించాం.. ప్రభుత్వ ఆఫీసుల్లో ఇందిరమ్మ క్యాంటీన్లను స్వయం సహాయక మహిళలతో ఏర్పాటు చేయించాం.. అన్ని జిల్లాల్లో స్వయం సహాయక మహిళా సంఘాలకు భవనాలు ఏర్పాటు చేశామని సిఎం రేవంత్ అన్నారు.

నారాయణపేటలో స్వయం సహాయక మహిళా సంఘాలతో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయించాం..

26 వేల ప్రభుత్వ పాఠశాలల నిర్వహరణను మహిళా సంఘాలకే అప్పగించాం..26 లక్షల ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల స్కూల్ యూనిఫామ్ లు కుట్టే బాధ్యతను స్వయం సహాయక మహిళలకు ఇచ్చాం..హైటెక్ సిటీ దగ్గర 1000 కోట్ల విలువ చేసే మూడున్నర ఎకరాల్లో మహిళా శక్తి స్టాల్స్ ను ఏర్పాటు చేశాం.. అమెజాన్ తో ఒప్పందం చేసుకుని ఆడబిడ్డల తయారు చేసే ఉత్పత్తులను అమ్మే విధంగా చేశాం.. 2034 నాటికి వన్ ట్రిలియన్ , 20247 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గా చేయాలని ప్రభుత్వం లక్ష్యం గా పెట్టుకుందని,ఇది జరగాలంటే మహిళలకు భద్రత ఉండాలని సిఎం అన్నారు. సమాజం నిలబడాలంటే మహిళలు తమ కాళ్లపైన తాము నిలబడాలి.. ఎంత ఆర్థిక ప్రగతి సాధించినా పిల్లలు సరైన దారిలో నడవకపోతే అంతా వృథా.. పంజాబ్ లాంటి రాష్ట్రంలో మన కళ్ల ముందే డ్రగ్స్ వల్ల యువత నిర్వీర్యం అయింది..

వ్యసనాలబారి న పడి ఆ రాష్ట్రం కోలుకోని స్థితిలో ఉంది.. స్కూల్స్ ముందు చిన్న చిన్న దుకాణాల్లో గంజాయి అమ్ముతున్నారు.. మత్తుకు బానిసలైన వారు, గంజాయి తీసుకుంటున్న వారే ఎక్కువ మంది మహిళలు, చిన్న పిల్లలపైన అకృత్యాలకు పాల్పడుతున్నారు.. ఈగల్ ఫోర్స్ ను మా ప్రభుత్వం తీసుకువచ్చి డ్రగ్స్ పైన కఠినంగా వ్యవహరిస్తోంది.. ఎంత పెద్ద వారు ఉన్నా, సెలబ్రేటీల్స్ ఉన్నా , ప్రజా ప్రతినిధులు ఉన్నా వదలకుండా అరెస్టు చేస్తున్నాం.. ఇటీవల డ్రగ్స్ కేసులో ప్రజాప్రతినిధులను కూడా అరెస్టు చేశాం.. గంజాయి, డ్రగ్స్, మద్యం బానిసల వల్ల జరిగే క్రైమ్స్ పైన పీస్ కమిటీ సభ్యులు దృష్టి పెట్టాలి.. మతకల్లోలాలకే కాకుండా పీస్ కమిటీలను విస్తరించాలి.. పాఠశాలల్లో చేరే సమయంలో డ్రగ్స్ తీసుకోమని సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి.. డ్రగ్స్ , గంజాయి పైన మాట్లాడాల్సిన అవసరం ఇప్పుడు ఉంది.. డ్రగ్స్ పునరావాస కేంద్రాలను కూడా పెంచుతున్నాం.. బాధ్యతను నిర్వహించకపోతే సమాజానికి అన్యాయం చేసినవాళ్లం అవుతాం.. మత్తును వదిలించాల్సిన అవసరం ఉంది..

ఎంత వారున్నా, సెలబ్రేటీస్ ఉన్నా ప్రజల మధ్య శిక్షిస్తే సందేశాన్ని ఇచ్చి వాళ్లం అవుతాం.. అని అన్నారు. భయం, బాధ్యత లేనప్పుడు విచ్చలవిడితనం వస్తుంది.. దీన్ని ప్రభుత్వం సహించదు.. నేరగాళ్ల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది.. ఎంత పెద్ద కుటుంబమైనా, రాజకీయ నాయకుడైనా, ఉన్నతాధికారుల కుటుంబమైనా నేను కేర్ చేయను.. డ్రగ్స్ ను నియంత్రించాల్సిందే.. తెలంగాణ రాష్ట్రం అంటే మహిళల రక్షణ కు పర్యాయ పదం గా తీర్చిదిద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఎంపిలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డిజిపి శివప్రసాద్ రెడ్డి, నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఏడుగురు ఆప్ ఎంపీల విలీనానికి రాజముద్ర

మొదటిపేజీ తరువాయి

ఆప్ సభ్యుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఆప్ నుంచి రాఘవ్ చద్దా, సాందీప్ పాఠక్, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, స్వాతీ మాలివాల్ సహా ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలోకి ఫిరాయించారు. వీరి విలీనానికి రాజ్యసభ ఛైర్మన్ ఆమోదం తెలపడంతో వారంతా బీజేపీ సభ్యులయ్యారు. విలీనం తర్వాత తమను బీజేపీ ఎంపీలుగానే పరిగణించాలని కోరుతూ ఈ ఏడుగురూ రాజ్యసభ ఛైర్మన్‌కు వినతి పత్రం సమర్పించారు. దానికి తాజాగా ఆమోదం లభించింది. కాగా, తమ పార్టీ నుంచి బీజేపీలోకి ఫిరాయించిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలను సస్పెండ్ చేయాలని కోరుతూ ఆప్ ఆదివారం రాజ్యసభ ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించింది. కేంద్ర సంస్థలను ఉపయోగించి తమ నాయకులను ఒత్తిడి చేసి బీజేపీలోకి చేర్చుకున్నారని ఆరోపించింది. ఈ అంశంపై చట్టపరమైన పోరాటం కూడా కొనసాగుతుందని తెలిపింది. ఆ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీలు ఇటీవల బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. అయితే ఆ విలీన ప్రక్రియను సోమవారం రాజ్యసభ ఛైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదించారు. దీంతో రాజ్యసభ వెబ్‌సైట్ ప్రకారం.. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సంఖ్య 10 నుంచి మూడుకు పడిపోయింది. ఇక బీజేపీ సంఖ్య 106 నుంచి 113కు చేరింది. ఇక రాజ్యసభలో ఎన్డీఏ బలం ఇప్పుడు 141 నుంచి 148కి పెరిగింది. దీంతో రాజ్యసభలో మెజారిటీ మార్క్ అయిన 123 సంఖ్యకు బీజేపీ చేరువు అవుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీలో చేరినట్లు ఆమ్ ఆద్మీ పార్టీలు సమర్పించిన విలీన లేఖపై రాజ్యసభ ఛైర్మెన్ రాధాకృష్ణన్ న్యాయపరమైన అభిప్రాయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏడుగురు ఆప్ ఎంపీలు ఆ లేఖపై సంతకం చేశారు. అయితే ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీల సంఖ్యలో 2/3 మెజారిటీ ఉన్నది. దీంతో ఎంపీల విలీన ప్రక్రియకు దాదాపు క్లియరెన్స్ వచ్చేసింది. రాఘవ్ చద్దా, సందీప్ పాతక్, స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, విక్రమ్‌జీత్ సాహ్నే, అశోక్ మిట్టల్, రాజేందర్ గుప్తాలు బీజేపీలో చేరారు. ఆప్ ఎంపీలు రాసిన లేఖ రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌కు తగినట్లు ఉందని రాజ్యసభ్య ఛైర్మెన్ భావిస్తున్నట్లు తెలిసింది. ఆ షెడ్యూల్ ప్రకారం 2/3 మెజారిటీ ఉంటే, విలీనాన్ని ఆమోదించవచ్చు. మరోవైపు ఆ ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఛైర్మెన్‌ను కోరిన విషయం తెలిసిందే.

# బెంగాల్ ప్రచారం ముగించిన ప్రధాని

మొదటిపేజీ తరువాయి

తాను హెలిప్యాడ్ దిగి వస్తుంటే దాదాపు 2 కిలోమీటర్ల దూరం వరకు ఇరువైపులా ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని అన్నారు. తనను ఆశీర్వదించడానికి వేలాదిమంది ప్రజలు వస్తారని ఊహించలేదని సంతోషం వ్యక్తంచేశారు. బెంగాల్‌లోని బారక్‌పుర్‌లో నిర్వహించిన ప్రచారంలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లోకి ప్రవేశించి.. భాజపాలో చేరిన తర్వాత ఓ కార్యకర్తగా పార్టీ ఏది చేయమన్నా చేశానని ప్రధాని వెల్లడించారు. ఎన్నికల బాధ్యతలు స్వీకరించడం కూడా ఇందులో భాగమేనని అన్నారు. తనకు ప్రత్యేకంగా ఓ కుటుంబం అంటూ ఏదీ లేదని.. దేశ ప్రజలే తన కుటుంబమని పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా తాను దేశంలోని ప్రతి ప్రాంతంలో పర్యటిస్తున్నానని..ఈ రోడ్‌షోలే తనకు పుణ్యయాత్రలని వ్యాఖ్యానించారు. వారు అధికారంలోకి రావడానికి కారణమైన 'మా-మాటి-మనుష్' నినాదాన్నే టీఎంసీ నేతలు విడిచిపెట్టారని ప్రధాని ఆరోపించారు. ఎన్నికల ప్రచార సమయంలో వారు ఒక్కసారి కూడా ఈ నినాదాన్ని ప్రస్తావించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆ పార్టీ నేతలు రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి ధూషణలు, బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీఎంసీ పాలనలో మహిళలపై జరుగుతున్నాయని, నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ ప్రాంగణం

మొదటిపేజీ తరువాయి

అధికారులకు పలు సూచనలు చేసారు. ఈసందర్భంగా పార్లమెంట్ తరహా లో అసెంబ్లీ ప్రాంగణం ఉండాలని అభిప్రాయపడ్డారు. సభ గౌరవం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెంబర్స్ కి మరింత ప్రైవసీ ఉండాలన్నారు. పబ్లిక్ గార్డె లో మెంబర్స్ కోసం క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు. మెంబర్స్ కోసం వాకింగ్ ట్రాక్,క్రీడల కోసం ఏర్పాట్లు ఉండాలన్నారు. వచ్చే సెషన్ నాటికి సెంట్రల్ హాల్ సిద్ధం కావాలని అన్నారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్ తరహాలో ఉండాలని సిఎం రేవంత్ గతంలోనే సూచనలు చేశారు. హెరిటేజ్ భవనాలకు నష్టం జరగకుండా చర్యలు ఉండాలని కూడా సూచించారు. అసెంబ్లీ ప్రాంగణం భద్రతని పటిష్టం చేయాలన్నారు.

# ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి

ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తనకు మంత్రి పదవిపై ఆశ లేదని వ్యాఖ్యానించారు. పదవులు అనేవి శాశ్వతం కాదని స్పష్టం చేశారు. ఒకాయన తాను పోరాడాతానా లేదా అని అన్నారని.. తాను పోరాడి చూపిస్తానని చెప్పుకొచ్చారు. గతంలో తనపై అనేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిన తన పని ఆగలేదని.. కొనసాగుతోందని స్పష్టం చేశారు. వివాదాస్పద సమస్యకు పరిష్కారం లభించిందని అన్నారు. లక్ష్యాలను ఎంచుకొని పనిచేస్తానని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యమకారుల సమస్యలు, ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని అన్నారు. ఇప్పటివరకు చేస్తున్న పనిని సమర్థవంతంగా పూర్తి చేయడానికి తనకు ఎమ్మెల్సీ ఉపయోగపడుతుందని వెల్లడించారు. జయశంకర్‌కు ఇచ్చిన మాట ప్రకారం ముందుకు పోతానని తెలిపారు.

# ఎన్నికల్లో 'మా-మాటి-మానుష్' దే విజయం

మొదటిపేజీ తరువాయి

ఐకమత్యం, సంస్కృతి, నాగరికత బెంగాల్‌కు గర్వకారణమని, బెంగాల్ వారసత్వాన్ని దిగజార్చాలనుకునే విభజన, విధ్వంసకర శక్తులకు రాష్ట్రంలో చోటులేదని పరోక్షంగా బీజేపీని ప్రస్తావిస్తూ మమతా బెనర్జీ ఘాటుగా విమర్శించారు. బీజేపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి నలుదిశలకు విస్తరిస్తున్న తరుణంలో ఏ దుష్టశక్తీ దానిని అడ్డుకోలేదని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ చర్యలు బెంగాల్ ప్రజలకు రక్షణకవచమని, వీటిని అడ్డుకోవడం భూప్రపంచంలో ఎవరికీ సాధ్యం కాదని అన్నారు. ఽూష్ట్ర అభివృద్ధి, శాంతి, ప్రగతికి అండగా ప్రజలు నిలబడతారనే నమ్మకం తనకు ఉందని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. 'మన భాష, మన సంస్కృతి, గర్వించదగిన ఈ నేల వారసత్వాన్ని మనం పరిరక్షించుకోవాలి. కులం, మతం, భాష, నేపథ్యంతో సంబంధం లేకుండా ఈనెల 29న ప్రజలంతా జోరఫూల్ గుర్తుకు ఓటు వేసి మా-మాటి-మనుష్ అభ్యర్థులకు అఖండ విజయం చేకూర్చాలి' అని మమతా బెనర్జీ కోరారు. భవానీపూర్ నియోజకవర్గం నుంచి మమతా బెనర్జీ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఈనెల 29న జరుగనున్న తుది విడత పోలింగ్‌లో భవానీపూర్ నియోజకవర్గం కూడా ఉంది. రెండు విడతలుగా నిర్వహిస్తున్న ఈ పోలింగ్‌లో తొలి విడత పోలింగ్ ఈనెల 23న జరిగింది.

ప్రజావీక్షణం దినపత్రిక
ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

## సంపాదకీయం

# శాంతి చర్చల పేరుతో దొంగాట !

ప్రపంచం శాంతిగా ఉండడం అటు అమెరికాకుకు, ఇటు ఇజ్రాయిల్‌కు ఇష్టం లేనట్లుగా ఉంది. తానో శాంతి కాముకుడినని చెప్పుకున్న ట్రంప్ చేస్తున్న చర్యలు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచాన్ని అశాంతిలోకి నెట్టాయి. దాదాపు రెండు నెలలు కావస్తుందో. ఇరాన్‌పై దాడిని ప్రారంభించిన ఫిబ్రవరి 28 నుంచి ఎప్రిల్ 28 వరకు ..పరిస్థితులు గమనిస్తూ ఇద్దరూ రావణ కుంభకర్ణుల్లా ప్రపంచం మీద విరుచుకు పడుతున్నారు. ఇరాన్ ప్రత్యక్షంగా మిగతా దేశాలు పరోక్షంగా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అయినా రక్తం మరిగిన పులిలా ఈ ఇద్దరూ తమ పంతాన్ని వీడడం లేదు. యుద్ధ ముగింపు కోసం ఆడుతున్న నాటకాలు ప్రజలు గమనిస్తు న్నారు. శాంతి చర్చల పేరిట ఇరాన్‌ను గుప్పిట పెట్టుకోవాలని చూస్తున్నారు. గల్ఫ్ చమురు ఉత్పత్తిలో ఎదురవుతున్న అంతరాయం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను కుదిపేస్తోంది. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు తలెత్తడానికి ముందు ఉత్పత్తి అయిన ముడి చమురుతో పోలిస్తే రోజుకు సుమారు 14.5 మిలియన్ బ్యారల్స్ ఉత్పత్తి నిలిచిపోయింది. అంటే ఘర్షణకు ముందు జరిగిన ఉత్పత్తిలో 57 శాతం పడిపోయిందని తెలుస్తోంది. పనిలోపనిగా భారత్ చైనాలను నరక కూపాలని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన మూర్ఖత్వాన్ని బయటపెట్టాయి. ఇరాన్‌పై ఒత్తడి పెంచడం తప్ప ఇప్పటి వరకు జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేదు. రసాయన ఆయుధాలు ఉన్నాయని గతంలో ఇరాక్‌పై దాడి చేసి, ఇరాక్ అధ్యక్షుడు సద్దం హుస్సేన్‌ను బలి తీసుకున్నారు. అక్కడ రసాయన ఆయుధాలు లేవని తేలింది. ఇప్పుడు ఇరాన్‌లో యురేనియం ఉందని, అణ్వాయుధాలు ఉన్నాయని బుకాయించి ఇరాన్‌పై పనిగట్టుకుని దాడి చేశారు. దేశాధినేత ఖమేనని మట్టుపెట్టారు. రెండు నెలలుగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం ఏర్పడ్డా పట్టించుకోవడం లేదు. స్వదేశంలో ట్రంప్‌కు విపరీతమైన వ్యతిరేకత వస్తున్నా లెక్క చేయడం లేదు. ఈ క్రమంలో ఇస్లామాబాద్ వేదికగా శాంతి చర్చలు ముందుకు సాగడం లేదు. అమెరికా, ఇజ్రాయిల్ డబుల్‌గేమ్ ఆడుతున్నాయనే చర్చ నడుస్తోంది. ఓ వైపు శాంతి చర్చలంటూ దౌత్యం నడుపుతూ.. మరోవైపు అరేబియా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకల్ని మోహరింప జేస్తోంది. హర్మూజ్‌పై పట్టు సాధించే ప్రయత్నం చేస్తోంది. ఇరాన్‌ను దిగ్బంధించే యత్నాలను యానుకో లేదు. ఇరాన్, అమెరికా మధ్య చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరినా, కొన్ని విషయాలు ఒప్పందానికి అడ్డంకిగా మారాయని తెలుస్తోంది. ముఖ్యంగా 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధిని నిలిపివేయాలన్న అమెరికా డిమాండ్‌ను ఇరాన్ అంగీకరించాల్సిందేనని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఇదే అంశంపై విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయకూడదన్నదే తమ ఏకైక లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రకటించినా, ఇజ్రాయిల్ వైమానిక దాడులతో జనావాసాలపై విరుచుకుపడుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాతో శాంతి చర్చలపై అనిశ్చితి నెలకొన్నదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధిస్తున్న ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం, బెదిరింపుల నడుమ ఆ దేశంతో చర్చలు అసాధ్యమని తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు.శాంతి చర్చలపై ఇరాన్ వైఖరిని స్పష్టం చేశారు. ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకోదని, అలాగే ఒత్తిళ్లకు తలొగ్గి ఒప్పందాలు చేసుకోబోదని పెజెష్కియాన్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఉద్రిక్తతలకు అమెరికానే కారణమని పెజెష్కియాన్ పేర్కొన్నారు. అమెరికా అనుసరిస్తున్న చర్యలే చర్చలకు ప్రధాన అడ్డంకి ఆయన పాక్ ప్రధానితో చెప్పినట్లు ఓ మీడియా వెల్లడించింది. ఏప్రిల్ 13 నుంచి ఇరాన్ ఓడరేవులను అమెరికా నౌకాదళం దిగ్బంధించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం వల్ల ఇరాన్ ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఇలాంటి దిగ్బంధనాల నడుమ పరస్పర నమ్మకాన్ని పునరుద్ధరించడం అసాధ్యమని పెజెష్కియాన్ వెల్లడించారు. అందుకే ఇరు దేశాల మధ్య చర్చలు జరగాలంటే ముందుగా అమెరికా ఆంక్షలను తొలగించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదన్న తన షరతును ట్రంప్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఇరాన్ తమను టెలిఫోన్‌లో సంప్రదించవచ్చునని, వారు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు మాట్లాడవచ్చునని ట్రంప్ చెప్పారు. హోర్ముజ్ జలసంధి నుంచి మందుపాతరలను తొలగించే పనిలో అమెరికా నౌకాదళం నిమగ్నమైందని ట్రంప్ తెలిపారు. ఇస్లామాబాద్ నుంచి వెళ్లిపోయిన తర్వాత ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. ఇప్పటికే తాము ఒక ఫ్రేమ్ వర్క్‌ను పాకిస్తాన్‌కు అందించామని తెలిపారు. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు ఇది ఒక మంచి మార్గమని ఆయన చెప్పారు. శాంతి చర్చలపై అమెరికాకు నిజంగా ఆసక్తి ఉందా అన్నది అనుమాన మేనని కూడా అన్నారు. ఇకపోతే త్రిడి, బెదిరింపు, స్వాధీనాల నడుమ ఒప్పందం ఎలా సాధ్యపడుతుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రశ్నించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో జరిపిన టెలిఫోన్ సంభాషణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్య చేశారని ఇరాన్‌కు చెందిన మెహర్ వార్తా సంస్థ తెలిపింది. చర్చలు, కాల్పుల విరమణ సందర్భాల్లో అమెరికా పదేపదే ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నదని, నిర్బంధాలకు తెగబడుతోందని ఆయన అన్నారు. ఇరాన్ ఓడరేవులపై నిషేధం కాల్పుల విరమణ అవగాహనకు తూట్లు పొడవడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ శుద్ధి చేసిన 400 కిలోల యురేనియంను తనకు అప్పగించాలని అమెరికా కోరుతుండగా ఇరాన్ ససేమిరా అంటోంది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా ఆంక్షలు ఎత్తివేసే వరకూ హోర్ముజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ఇరాన్ తేల్చి చెప్పింది. ఒప్పందం కుదిరే వరకూ నిర్బంధం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటున్నారు. మొత్తంగా చర్చల పీటముడి వీడేలా లేదు. ప్రపంచం ప్రశాంతంగా నిద్రపోయేలా కూడా లేదు.

# పిల్లల భద్రతకు సమిష్టి కృషి అవసరం

## - యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపు

## - జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)**

ప్రజా పాలన ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఐదవ థీమ్ కింద ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వరంగల్ ఎంజీఎం వద్ద గల ఐఎంఈ హాల్లో సోమవారం నిర్వహించిన తొలి రోజు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం యువతపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేస్తూ, యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా బాలల సంరక్షణ గృహాల్లోని పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆరోగ్యశ్రీ కార్డులు, క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలని, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాలల రక్షణకు కట్టుబడి ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, డిడబ్ల్యుఓ రాజమణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, డిబిసిడిఓ పుష్పలత, డిఎంహెచ్వో సాంబశివరావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

## - హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి

## - ప్రజావాణికి వచ్చిన అర్జీలు 162

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)**

ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి అందిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓ లతో పాటు ట్రైనీ ఐఏఎస్ సాయి శివానీ, జిల్లా అదనపు కలెక్టర్ ఫిర్యాదు లను స్వీకరించారు. ప్రజా వాణి కార్యక్రమంలో ప్రజలు మున్సిపల్, రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌరసరఫరాలు, ఇతర శాఖలకు సంబంధించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 162 అర్జీలను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భం గా జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు



రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, డిఆర్డిఓ మేన శ్రీను, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాపట్లలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ మునిసిపల్ ఆర్ఐ ఇమామ్

**బాపట్ల : ఏప్రిల్ 27 ( ప్రజా వీక్షణం ) :**

బాపట్ల మునిసిపల్ ఆర్ఐ షేక్ ఇమామ్ లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే బాపట్ల మునిసిపల్ రెవెన్యూ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న షేక్ ఇమామ్ బాపట్ల జిల్లా చినగంజాం మండలం కొత్తపేటకు చెందిన దేవరకొండ నాగేంద్రంకి బాపట్ల పట్టణంలోని సంజయ్ గాంధీ కాలనీలో ఉన్న ఇంటి పన్ను పేరు మార్పు కోసం రూ. 60,000 లంచం అడిగాడని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా బాపట్ల మండలం సూర్యలంక రోడ్డులోని ముత్తాయిపాలెం వద్ద ఉన్న టీ హౌస్ వద్ద నగదు లావాదేవీలు జరుగుతున్న క్రమంలో ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ మాట్లాడుతూ.....బాపట్ల మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ రెవెన్యూ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న షేక్ ఇమామ్ దేవరకొండ నాగేంద్రం వద్ద రూ. 60,000 లలో రూ. 25,000 లంచం నగదు రూపంలో,రూ. 35,000 చలానా రూపంలో తీసుకుంటూ పట్టుబడ్డాడని తెలిపారు. ఎవరైన ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే ఏసీబీ అధికారులకు పిర్యాదు చేయాలనీ అన్నారు. ఈ సంఘటనతో బాపట్ల పట్టణం





ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ విషయం తెలిసిన వెంటనే బాపట్ల మునిసిపల్ కార్యాలయంలో ఏ సిబ్బంది తమ సీట్లలో లేకుండా పరారయ్యారు. ఈ దాడిలో ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ మరియు నలుగురు ఏసీబీ సీఐలు పాల్గొన్నారు.

# ఎలక్ట్రికల్ ఎస్సీ ఆనందం కు సన్మానం

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)**

ఇటీవల వరంగల్ ఎలక్ట్రికల్ ఎస్సీ గా బాధ్యతలు స్వీకరించిన అన్నిమల్లె ఆనందమును దళిత బహుజన ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రైతు రమేష్ కుమార్ సోమవారం ఆయన స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు. ఆనందం గతంలో ములుగు ఎస్సీ గా సంవత్సరం పాటు విధులు నిర్వహించారు మేడారం జాతర విజయోత్సవానికి కృషి చేశారు. గత 40 సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ రాష్ట్ర బాధ్యత నిర్వహించి అనేకమంది కార్మికుల సమస్యలు పరిష్కరించడం లో మేటి అని ఇంకా తన సేవలు ముందు ముందు కార్మికులకు అందేలా తగిన కృషి చేయాలని రౌతు రమేష్ కుమార్ కోరారు. వినియోగదారులకు సేవలందించడంలో సఫలీ కృతులు కావాలని బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల హక్కులు, విధులు నిర్వహించేలా తగిన కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆనందం ను శాలువాతో, మెమెంటో తో అంబేద్కర్ గ్రంథం తో సత్కరించారు.



# స్కూటీలు ట్రై సైకిల్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**దేవరకద్ర : ఏప్రిల్ 27 (ప్రజా విక్షణం)**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం వికలాంగులకు స్కూటీలు అలాగే ట్రై సైకిల్ అను స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, పంపిణీ చేశారు, అలాగే అంగన్వాడి ఉపాధ్యాయులకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలను వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ మున్సిపల్ చైర్ పర్సన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగేందర్ రెడీ, మార్కెట్ చైర్మన్ కథలయ్య, టి పి సి సి ఆర్గనైజర్ సెక్రెటరీ అరుణ్ కుమార్ రెడ్డి, రాచల యుగేందర్, శేఖర్, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.





# ఉపాధి పని ప్రదేశంలో ప్రమాదానికి గురైన కార్మికురాలిని పరామర్శించిన వ్యవసాయ

## - కార్మిక సంఘం నాయకులు..


**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 27(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంఈనెల 23 గురువారం రోజున ఉపాధి పని ప్రదేశంలో ప్రమాదానికి గురైన కార్మికురాలిని పరామర్శించిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులురెబ్బెన మండలం తుంగెడ గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశంలో ప్రమాదానికి గురై కాలు ఫ్యాక్చర్ అయిన డోంగ్రి రాధను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పనుల సమయంలో ప్రమాదాలకు గురయ్యే కార్మికులకు ప్రభుత్వం పూర్తి వైద్య ఖర్చులను భరించాలని డిమాండ్ చేశారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకు మస్టర్ రోల్‌లో వేతనాలు చెల్లించాలని, ప్రమాద తీవ్రతను బట్టి తగిన నష్టపరిహారం కూడా అందించాలని కోరారు. పని ప్రదేశాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటికే అనేకమంది కార్మికులు గాయపడి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ కార్మికులందరికీ ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, పని ప్రదేశాల్లో తగిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ప్రమాదాలకు గురైన వారికి వైద్య ఖర్చులు చెల్లిస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుతం డోంగ్రి రాధకు అవసరమైన పూర్తి వైద్య సహాయం అధికారులు వెంటనే అందించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బొరుకుటే రాజేందర్, తుంగెడ ఉపసర్పంచ్ రాజు మరియు ఇతరులు పాల్గొన్నారు.



# విధుల్లో చేరిన ట్రైనీ ఐఏఎస్ సాయి శివాని

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)**



హనుమకొండ జిల్లాకు శిక్షణ లో భాగంగా ట్రైనీ ఐఏఎస్ అధికారి సాయి శివాని సోమవారం హన్మకొండ కలెక్టరేట్లో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా కలెక్టరేట్ లో పలువురు అధికారులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియ జేశారు. శిక్షణ కాలంలో భాగంగా పరిపాలన, రెవెన్యూ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవల నిర్వహణ తదితర అంశాలపై ప్రాయోగిక అవగాహన పొందేందుకు ట్రైనీ కలెక్టర్ సాయి శివాని వివిధ శాఖల పని తీరును పరిశీలించ నున్నారు.

# తెలంగాణ గుండె చప్పుడు..

## - తెలంగాణ ప్రజలకు కొండంత అండ గులాబీ జెండా..





దేవరకద్ర : ఏప్రిల్ 27( ప్రజా వీక్షణం)

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా పార్టీ జెండాలు ఎగురవేసి పండుగలా జరుపుకోవాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఆదేశానుసరం దేవరకద్ర నియోజకవర్గ / మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద గులాబీ జెండా ఎగురవేసి పార్టీ సంబురాలు జరుపుకున్న బీఆర్ఎస్ శ్రేణులు.

చేతులెత్తి మొక్కుడు కాదు, మన హక్కుల కోసం పిడికిలి బిగించి కొట్లాడుడు నేర్పిన పార్టీకి నేటికి 25 ఏళ్లు.. పద్నాలుగేళ్ల పోరాటం, పదేళ్ల స్వపరిపాలన, మూడేళ్లుగా ప్రతిపక్ష భాధ్యత ఇది పార్టీ మాత్రమే కాదు, మా గర్వం, మా బలం, బలగం మా తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్ పార్టీ అంటూ పెద్ద ఎత్తున జై తెలంగాణ, జై బీఆర్ఎస్ జై కేసీఆర్ నినాదాలతో హోరేత్తించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... అధికారంలోనైనా, ప్రతిపక్షంలోనైనా ఎప్పుడూ ప్రజల పక్షానే నిలబడి, తెలంగాణను కంటికి రెప్పలా కాపాడుకున్న పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. మండల మరియు మున్సిపాలిటీ ప్రజలకు భారత రాష్ట్ర సమితి 26 వ ఆవిర్భావ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. నాలుగు కోట్ల గొంతులను ఏకం చేసి విప్లవ శంఖం మోగించిన ధిక్కార వేదిక, సమైక్య సంకెళ్లను తెంచి స్వరాష్ట్ర కాంక్షను సాకారం చేసిన యుద్ధ గీతిక బీఆర్ఎస్ అన్నారు. పదేళ్ల పాలనతో ఉద్యమ తెలంగాణను ఉజ్వల తెలంగాణగా తీర్చిదిద్ది, అభివృద్ధి లో తెలంగాణ జాతి ఆత్మగౌరవ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గులాబీ దీపిక, ప్రజల విశ్వాసానికి ప్రతీక అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీ ఇవాళ తెలంగాణ ప్రజల్లో ఒక గొప్ప ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందని. నాటి ఉద్యమ చైతన్యాన్ని రగిల్చిందని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం నాలుగు కోట్ల ప్రజలను ఒక్క తాటి మీదకు తెచ్చి, ఉద్యమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకుపోయిన మహానాయకుడు కేసీఆర్ అని ప్రశంసించారు. కేసీఆర్ నాయకత్వంలో పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న ఈ శుభ సందర్భంగా ఉద్యమకారులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు, ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆత్మ బలిదానాలు చేసుకున్న ఉద్యమకారులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అమరవీరుల ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైందని, రేవంత్ సర్కార్ పాలనతో ప్రజలు విసుగు చెందారని రాష్ట్ర ప్రజలంతా మళ్లీ కేసీఆర్ పాలన కోసమే ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో గెలుపొంది బీఆర్ఎస్ మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జెట్టి నరసింహా రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, మున్నూరు బాల్ రాజ్, చల్మా రెడ్డి, దొబ్బలి ఆంజనేయులు, రాధా కృష్ణ, సత్యం సాగర్, రాం దాసు, గోపాల్, పాషా, హస్నోద్దీన్, భార్గవ్, నవీన్ గౌడ్, అజారుద్దీన్, కురుమూర్తి, గుంతపల్లి అంజి, శాలి అంజనేయులు, రియాజ్, శ్రీను, వెంకటేష్, మజర్ రెహ్మాన్ ఖదీర్ (జిల్లు )మరియు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ దమయంతి..

దేవరకద్ర : ఏప్రిల్ 27 (ప్రజా విక్షణం)

మండల కేంద్రంలో సోమవారం డాక్టర్ వాటర్ ప్లాంట్ దగ్గర శివలక్ష్మి రాములమ్మ ఇందిరమ్మ నిర్మాణం కోసం మున్సిపల్ చైర్పర్సన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, సోమవారం భూ మీ పూజ చేశారు. నిర్మాణం పనులు త్వరగా పూర్తి కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ యుగేందర్ రెడ్డి, రెండో వార్డ్ భీమయ్య, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# నాదెండ్ల భాస్కరరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన జనసేన నాయకులు

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం)

మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు ఇటీవల కాలం చేశారు. ఈ విషయం తెలుసుకున్న గోదావరి జిల్లాల వీర మహిళ కోఆర్డినేటర్ కసిరెడ్డి మధులత, జనసేన పట్టణ అధ్యక్షుడు వర్ధనపల్లి కాశి, పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్ల బాబి, తాడేపల్లిగూడెం మండల అధ్యక్షుడు ఆడపా ప్రసాద్, జనసేన నాయకుడు చెరుకూరి జగత్ సోమశేఖర్ సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, నాదెండ్ల మనోహర్ కు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముందుగా నాదెండ్ల భాస్కరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



# విధుల్లో ఆరోగ్యం ముఖ్యం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా..

రామగుండం పోలీస్ కమిషనరేట్

ఏప్రిల్ 27(ప్రజా వీక్షణం న్యూస్)

రామగుండం పోలీస్ కమిషనరేట్ ఎండాకాలంలో ట్రాఫిక్ సిబ్బంది రక్షణకు చలువ కళ్లద్దాల పంపిణీ రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చలువ కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఎండాకాలంలో ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బంది ఎండ వేడిమి నుండి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఒక్కరి పనితీరును స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రోడ్లపై విధులు నిర్వహించే సమయంలో వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ చలువ కళ్లద్దాలను అందజేస్తున్నామని తెలిపారు. విధుల పరంగా గానీ, వ్యక్తిగతంగా గానీ ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎండ వేడిమి ప్రభావం నుండి రక్షణ పొందేందుకు తరచుగా ఎక్కువగా నీళ్లు త్రాగాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలపై



ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, ఆర్.ఐ.రమేష్, ఎస్.ఐ.హరిశేఖర్ మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల్లో దైవభక్తిని పెంపొందించడానికి దేవాలయ నిర్వాహకులు కృషి చేయాలి

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం)

ప్రజల్లో దైవభక్తి, హిందూధర్మ పరిరక్షణను పెంపొందించడానికి దేవాలయ నిర్వాహకులు కృషి చేయాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. పెంటపాడు మండలం పడమర విప్పరులోని ఆదికేశవ స్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన స్వామివారి కళ్యాణ మహోత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ దేవునికి కళ్యాణ మహోత్సవాలు నిర్వహించడం హిందూ సంప్రదాయంలో ఒక ముఖ్య ఆధ్యాత్మిక కార్యక్రమమని, లోక కళ్యాణం కోసం దేవునికి కల్యాణ నిర్వహించటం తరతరాలుగా వస్తున్న ఆచారమని తెలిపారు. దైవానుగ్రహంతోనే నియోజకవర్గంలో భారీ ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పడమరవిప్పర్రు ఆదికేశవ స్వామి ఆలయంలో అత్యంత వైభవంగా ఈ కళ్యాణ మహోత్సవం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ప్రజలంతా స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా

ఏప్రిల్ 27(ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయం (తెలంగాణ భవన్)లో భారత రాష్ట్ర సమితి 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే తనయుడు యువ నాయకులు కోవ సాయినాథ్ మండల అధ్యక్షులు,స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గత రెండున్నర దశాబ్దాలుగా పార్టీ సాధించిన విజయాలను, తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో రాష్ట్ర పునర్నిర్మాణంలో బిఆర్ఎస్ పోషించిన కీలక పాత్రను ఈ సందర్భంగా వక్తలు స్మరించుకున్నారు. జై తెలంగాణ జై కెసిఆర్ అనే నినాదాలతో కార్యాలయ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు,గుండి సర్పంచ్ జబరి రవీందర్,ఆసిఫాబాద్ మునిసిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ యం డి.అహ్మద్, బి ఆర్ ఎస్ నాయకురాలు మర్సకోల సరస్వతి, మాజీ సింగిల్ విండో చైర్మన్ అలిబిన్



అహ్మద్,కౌన్సిలర్లు చిలువేరు వెంకన్న, కుర్సెంగ బాలకృష్ణ, సర్పంచ్ బుర్స పోచయ్య, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు నిస్సార్, అన్సర్, జీవన్, సాయి శ్రవణ్ పొన్నాల నారాయణ, బలరాం నాయక్,దూడల అశోక్, ప్రేమ్ కుమార్, నారా ఆశన్న,గిరి, సి ఎచ్.రవి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వికలాంగులకు త్రీచక్ర వాహనాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)

హనుమకొండ జిల్లా బాలసముద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి వికలాంగులకు త్రీచక్ర మోటార్ వాహనాలను పంపిణీ చేశారు. ఈ వాహనాలను సీసీఆర్ నిధుల కింద ప్రత్యేకంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వికలాంగులు, దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హత కలిగిన వారికి ఉచితంగా సహాయక పరికరాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.ఇటువంటి పథకాలు వికలాంగులకు స్వయం ఆధారిత జీవనం సాగించేందుకు దోహద పడతాయని ఆయన పేర్కొన్నారు. త్రీ చక్ర వాహనాలతో లబ్ధిదారులు తమ రోజువారీ పనులను సులభంగా నిర్వహించ గలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.







# బాపట్ల జనసేన పార్టీలో ' విగ్రహ ' రాజకీయం

## - ఎమ్మెల్యే - జనసేన సమన్వయకర్తల రాజకీయాలకు బలైన విన్నకోట సురేష్?

బాపట్ల : ఏప్రిల్ 27 ( ప్రజా వీక్షణం ) :

ఆదివారం బాపట్ల పట్టణంలో జరిగిన పేరం గరుడాచలం నాయుడు విగ్రహావిష్కరణ కార్యక్రమం బాపట్ల రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.మహనీయుడి విగ్రహ స్థాపన కోసం అహర్నిశలు శ్రమించిన జనసేన నాయకులు విన్నకోట సురేష్ ను చివరి క్షణంలో పక్కనపెట్టడం వెనుక స్థానిక ఎమ్మెల్యేతో పాటు,జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త,కాపు సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తుల రాజకీయాలు ఉన్నాయన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి.విగ్రహ ఏర్పాటుకు స్థల ఎంపిక నుంచి పరిశు భ్రత,సుందరీకరణ,విరాళాల సేకరణ, ప్రజల్లో అవగాహన కల్పించడం వరకు ప్రతి దశలో విన్నకోట సురేష్ కీలక పాత్ర పోషించారు.స్థానికంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతం కావడానికి ఆయన చేసిన కృషి అందరికి తెలిసిందే. అయితే,కార్యక్రమం పూర్తయ్యే సమయానికి శిలాఫలకంపై ఆయన పేరు లేకపోవడం,ఆవిష్కరణకు ఆహ్వానం అందకపోవడం తీవ్ర అసంతృప్తికి దారితీసింది.పార్టీలో విన్నకోట సురేష్ కు పెరుగుతున్న ప్రజాదరణను చూసి అసూయ చెందిన కొందరు,ఎమ్మెల్యే ఆశీస్సులతో పాటు నియోజకవర్గ సమన్వయకర్తకు సన్నిహితులైన తమ సామాజిక వర్గ వ్యక్తులను రంగంలోకి దింపి,సురేష్ ను రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కష్టపడి పనిచేసిన నాయకుడిని కావాలనే పక్కనబెట్టి,చివరి నిమిషంలో వేదికపై మరికొందరిని కూర్చొబెట్టడం వెనుక స్పష్టమైన వ్యూహం కనిపిస్తోందని పార్టీ శ్రేణులు వ్యాఖ్య నిస్తున్నాయి.చెమట విన్నకోటది.. .చప్పట్లు మరొకరివి అన్న వ్యాఖ్యలు ఇప్పుడు బాపట్లలో మారుమోగుతున్నాయి.మహనీయుడి విగ్రహం సాక్షిగా వ్యక్తిగత కక్షలు,వర్గ రాజకీయాలు నడపడం పట్ల జనసేన కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కష్టపడే కార్యకర్తలకే ప్రాధాన్యత ఇస్తామని చెబుతుంటే,బాపట్లలో మాత్రం కొందరు నేతలు స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ సిద్ధంతాలను తుంగలో తొక్కుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. వెంుత్తానికి విగ్రహావిష్కరణ వేదికగా వెలుగుచూసిన ఈ అంతర్గత రాజకీయాలు బాపట్ల జనసేన పార్టీలో



చర్చనీయాంశంగా మారాయి.కష్టపడిన నాయకుడిని కించపరిచే ఈ తరహా చర్యలు పార్టీ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# పిల్లలు నాయకత్వ లక్షణాలు కలిగి గ్రామాల సమస్యలను గుర్తించాలి





ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)

బాల పంచాయతీ ద్వారా సురక్షిత గ్రామాలను, బాల బాలికల భద్రతను నిర్మించ వచ్చని వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా 5వ అంశంగా బాలల భద్రత వారోత్సవాల కార్యక్రమాల లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సంగెం మండలము తీగరాజ పల్లి గ్రామం నందు తెలంగాణ పోలీస్ విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో, మై ఛాయస్ ఫౌండేషన్, యంగిస్తాన్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో గ్రామ సర్పంచి గోపాల్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పోలీసు విమెన్ సేఫ్టీ వింగ్ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో బాల పంచాయతీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని గ్రామంలో ఉన్న 15 మంది బాల బాలికలను చైల్డ్ పార్లమెంట్ లేదా బాల పంచాయితీకి ఎంపిక చేసి ఎంపిక చేయబడిన బాలలు భవిష్యత్తులో వారి సేఫ్టీ, భద్రత, గ్రామ అభివృద్ధి, పిల్లల భవిష్యత్తు గురించి వారు ఒక నాయకత్వ లక్షణాలు కలిగి గ్రామాల వివిధ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యం లో అట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఈ సందర్భంగా బాల పంచాయతీ ప్రతినిధులు ఐదు అంశాల పైన వారు పని చేస్తారని అన్నారు అందుకు గాను పోలీసు, ఇతర యంత్రాంగమంతా బాల పంచాయతీ ప్రతినిధులకు వాళ్ళ సమస్యలు గుర్తించడానికి వారు చూపించిన సలహాలను స్వీకరించి అట్టి వాటికి పరిష్కార మార్గాలను చూపించాలని తెలిపారు.

ఇట్టి బాలలకు బాల పంచాయతీ ప్రతినిధులకు ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు, తల్లి దండ్రులు ప్రజలు సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమం నందు విశిష్ట అతిథులుగా హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి విజయ లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, బాలల భద్రత కొరకు ఏర్పాటు చేసిన ఈ బాల పంచాయతీ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ గ్రామాన్ని ఎంపిక చేసి నిర్వహించడం జరుగుతుందని రెండు నెలల తర్వాత పిల్లలు గుర్తించిన సమస్యలను పరిష్కరించి వాటిపైన సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం నందు మై చాయిస్ ఫౌండేషన్ స్టేట్ కో..ఆర్డినేటర్ జన్ను క్రాంతి, ఎర్ర శ్రీకాంత్ పిల్లలకు విజన్ డాక్యుమెంట్ పైన ఓరియంటేషన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మామునూరు ఏసిపి వెంకటేష్, పార్వతగిరి సీఐ. రాజగోపాల్, ఇన్స్పెక్టర్ జె. శ్యాంసుందర్, షి టీమ్స్ సి ఐ సుజాత, భరోసా సి ఐ సువర్ణ, ఎస్ ఐ. ప్రవీణ్, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, ఎఫ్ఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్ సహాయ, కో..ఆర్డినేటర్ బత్తుల కరుణ, డి ఎల్ పి ఓ వేదవతి, ఎంపీ ఓ హర్షిత్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ వసుధ తదితరులతో పాటు ప్రభుత్వ అధికారులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలి

## - పురపాలక సంఘు కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం),

ప్రజా సమస్యల పరిష్కార వేదికను పట్టణ ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని పురపాలక సంఘు కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘు కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూపట్టణంలోని వివిధ వార్డుల నుంచి హాజరైన ప్రజలు డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాలు, పారిశుధ్యం, ఆస్తి పన్ను, ఇంటి నిర్మాణ అనుమతులు తదితర సమస్యలపై అర్జీలు అందజేశారని తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అక్కడికక్కడే తెలియజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వెంకటరమణ, మేనేజర్ రవి సుధాకర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సీతారాం , రెవెన్యూ ఆఫీసర్ ప్రసాద్, సానిటేషన్ సూపర్వైజర్ సోమేశ్వరరావు, పలువురు పురపాలక సంఘు అధికారులు పాల్గొన్నారు.





# వేగవంతంగా ధాన్యం కొనుగోలు పక్రియ

## - అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రతిమా సింగ్

## - హవేలీ ఘన్‌పూర్ మండల కేంద్రం ఆకస్మిక తనిఖీ

మెదక్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు పక్రియ వేగవంతంగా జరగాలని.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కేంద్ర నిర్వాహకులను, వ్యవసాయ, సివిల్ సప్లై అధికారులను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలోని ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్నీ సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధాన్యం కొనుగోలు వివరాలు, అందుబాటులో ఉన్న టార్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపు తదితర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగంగా జరగాలని ఇప్పటి వరకు 880. మంది రైతుల నుండి 4270. 040 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం జరిగిందని 38 మంది రైతులకు -42 లక్షల రూపాయలు ఖాతాలో జమ చేశామన్నారు. ధాన్యం కొనుగోలు పక్రియ సాఫీగా సాగేందుకు?మూడు దశల్లో టోకెన్ పద్ధతి ని పెట్టడం జరిగిందని.. దీనిని ఆయా శాఖల అధికారులు తూ. చ తప్పకుండ పాటించాలని తద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా?తేమ శాతం వచ్చిన ధాన్యం వేగం గా కొనుగోలు అవ్వడం జరుగుతుందన్నారు. కొనుగోలు పక్రియ పూర్తి కాగానే వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యం బస్తాలను తరలించాలన్నారు. రవాణా పరంగా కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా తగు లారీలను నిర్వాహకులు కేంద్రాలకు సరైన సమయం లో వచ్చేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. వేసవి ఎండల నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇచ్చిన టోకెన్ల ఆధారంగా కేంద్రాలకు రావాలన్నారు.

# క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చు

## - తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల మల్లికార్జునరావు





**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం)**

క్రీడలతో శారీరక, మానసిక ధృడత్వాన్ని పెంపొందించుకోవచ్చని తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) సూచించారు. పెంటపాడు మండలంలోని పెంటపాడు గ్రామంలో జీవి కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వలవల మల్లికార్జునరావు (బాబ్జి) క్రీడాకారులను పరిచయం చేసుకుని, క్రీడా పోటీలను ప్రారంభించారు. కొంతసేపు క్రికెట్ ఆడి నాయకులు, క్రీడాకారుల్లో జోష్ నింపారు. ఈ సందర్భంగా వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ ఎస్టివిఎన్ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న ఈ మెగా క్రికెట్ టోర్నమెంట్ లో మొత్తం 41 పాల్గొంటున్నాయని, ఆయా జట్లు 12 ఓవర్ల చొప్పున క్రికెట్ మ్యాచ్ లు ఆడనున్నారని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే తన చిన్ననాటి రోజులు గుర్తుకొస్తున్నాయన్నారు. తాను ఇదే పాఠశాలలో నాలుగు సంవత్సరాలు చదువుకున్నానని చెప్పారు. ఎంతో చరిత్ర, క్రమశిక్షణ కలిగిన పాఠశాల అని కొనియాడారు. దేశంలో అత్యంత ఆదరణ పొందిన క్రీడ క్రికెట్ అని, అత్యంత ప్రభావవంతమైన క్రీడాకారులను భారతదేశం తయారుచేస్తుందని ప్రశంసించారు. ఎక్కడైనా సరే, ఏ టీం పైనైనా సరే గెలవగలమనే నమ్మకాన్ని జాతీయస్థాయి క్రీడాకారులు అభిమానులకు కల్పించారన్నారు. 20 ఓవర్లలో 300 పరుగులు చేసే దమ్ము భారత క్రికెట్ జట్టుకు ఉందని ప్రశంసించారు. సెలవు రోజుల్లో యువత తమ నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ఇటువంటి క్రికెట్ టోర్నమెంట్ లు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆకాశపు స్వామి, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పద్మనాభుని మురళి, బండారు వెంకటరావు, నల్లిమిల్లి గోపిరెడ్డి, ఇమ్మంది లక్ష్మయ్య, ముప్పిడి రమేష్, పంతం శేఖర్, చెప్పులు వాసు, సతీష్, సిర్రపరపు వెంకట్రావు, నక్క సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం)**

చలివేంద్రాలను ఏర్పాటు చేయటం అభినందనీయమని పురపాలక సంఘ కమిషనర్ ఎంఎస్ బాబు కొనియాడారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కార్యాలయం వద్ద దాతల సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కమిషనర్ ఏసుబాబు స్వయంగా బాటసారులకు, ప్రజలకు మజ్జిగ, మంచినీరు అందించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చిన దాతల సేవలను ప్రశంసించారు. దాతృత్వంతో ముందుకొచ్చి ప్రజాసేవలో భాగస్వాములవుతున్న వారి స్ఫూర్తి అందరికీ ఆదర్శమని కొనియాడారు. పట్టణంలోని మరిన్ని ప్రాంతాల్లో దాతలు, స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి పాదచారులకు అండగా నిలవాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ అన్ని కమిటీలు రద్దు

## - కొత్త కమిటీలు నియమించాలని కెసిఆర్ ఆదేశం




**హైదరాబాద్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)**

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ రాష్ట్ర స్థాయి కమిటీ మినహా అన్ని కమిటీలను రద్దు చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే అన్ని స్థాయిల కమిటీలను నియమించాలని కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. కొత్త కమిటీలకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ బాధ్యతలను కేటీఆర్‌కు అప్పగించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కేసీఆర్ సూచించారు. బుక్ మీదనే కాకుండా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సభ్యత్వాలు నమోదు చేయాలని ఆదేశించారు.

# రైతులు రీ సర్వేకు సహకరించాలి

## - తహసిల్దార్ రాజరాజేశ్వరి




**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం)**

రైతులు రీ సర్వేకు సహకరించాలని తహసిల్దార్ రాజరాజేశ్వరి సూచించారు. మండలంలోని ఆరుగొలను రైతు సేవా కేంద్రంలో రీ సర్వేపై సోమవారం ఆమె అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ రీ సర్వేకు రైతులు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. సర్వే సమయంలో సంబంధిత రైతులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్స్ ను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. రీ సర్వే గురించి రైతుల ఆందోళన చెందాల్సిన పనిలేదని వివరించారు. డిప్యూటీ తహసిల్దార్ కాళీకృష్ణ మాట్లాడుతూ నవాబుపాలెం గ్రామాన్ని మొదటి దపాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, ఈ సర్వేలో విజయం సాధించామని తెలిపారు. రెండవ దఫాలో వీరంపాలెం, మూడవ దఫాలో తాడేపల్లి, చినతాడేపల్లి గ్రామాలు, నాలుగవ దఫాలో కడియద్ద కృష్ణయ్యపాలెం గ్రామాలు, ఐదో దఫాలో ఆరుగొలను, మాధవరం గ్రామాల్లో ఈ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరుగొలను రెవెన్యూ గ్రామంలో ఆరుగొలను, కొత్తూరు, దండగర్ర గ్రామాలు ఉన్నాయని తెలిపారు. 1920లో బ్రిటిష్ వారి సర్వే చేశారని, ఇప్పటికి వంద సంవత్సరాలు పూర్తయిందన్నారు. రీ సర్వే చేసే సమయంలో సంబంధిత రైతులకు ముందస్తుగానే సమాచారం అందిస్తామని, ఆ సమయంలో తమ వద్ద ఉన్న డాక్యుమెంట్స్ తో రావాలని సూచించారు. ఆరుగొలనులో 2257 ఎకరాలు, కొత్తూరులో 1029 ఎకరాలు, దండగర్రలో 1511 ఎకరాలున్నాయని, ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు భూములు కూడా ఉన్నాయని వివరించారు. రైతులు అడిగిన పలు సందేహాలను తహసీల్దార్,, డిప్యూటీ తహసిల్దార్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ చక్రవర్తి, వీఆర్వో దివ్య, కూటమి నాయకులు వట్టూరి రాంబాబు, చిక్కాల చిరంజీవి, అడపా అప్పలరాజు, ఆరుగొలను, కొత్తూరు గ్రామాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

# మక్కజొన్న రైతులను ఆదుకోండి

## - వెంటనే కొనుగోలుకు ఏర్పాటు చేయండి
## - ధర్య వ్యత్యాసం కూడా వారికి చెల్లించాలి
## - కేంద్రమంత్రి చౌహాన్‌కు సిఎం చంద్రబాబు లేఖ

**అమరావతి,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)**

ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. 2025-26 రబీ సీజన్‌కు సంబంధించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మొక్కజొన్న రైతులకు ధరల వ్యత్యాస చెల్లింపు పథకాన్ని వర్తింప చేయాలని విన్నవించారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఆందోళనగా ఉన్నారు. మార్కెట్‌లో ఈ పంట ధర రోజురోజుకూ పడిపోతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా మొక్కజొన్న ధర రూ. 1,600 నుంచి రూ. 1,700 మధ్య మాత్రమే ఉంది. కనీస మద్దతు ధర రూ. 2,400 కంటే చాలా తక్కువగా ప్రస్తుత మార్కెట్ ధర ఉంది. రాష్ట్రంలో సుమారు 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇంకా 14.26 లక్షల మెట్రిక్ టన్నుల పంట కోత దశలో ఉంది.కాలంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే రైతులు నష్టపోతారు. మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రం నుంచి మద్దతు లేకపోవడంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతుంది. పిఎం-ఆశా కింద ధరల వ్యత్యాసాన్ని నేరుగా రైతులకు చెల్లించాలి. ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా పరిగణించి, ధరల వ్యత్యాసంలో 100 శాతం నిధులను కేంద్రమే భరించాలి. ఈ పథకాన్ని జూన్ 2026 వరకూ పొడిగించాలి. నాఫెడ్, ఏపీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో ఈ పథకాన్ని అమలు చేసేందుకు తక్షణమే అనుమతులివ్వాలి' అని సీఎం చంద్రబాబు లేఖలో కోరారు.

# నియోజకవర్గ అభివృద్ధి నా లక్ష్యం..

# తప్పుడు ప్రచారాలు మని అభివృద్ధికి సహకరించండి.

## - ఎమ్మెల్యే జిఎంఆర్




**దేవరకద్ర : ఏప్రిల్ 27 (ప్రజా విక్షణం)**

నియోజకవర్గ అభివృద్ధి నా లక్ష్యంగా పనిచేస్తున్నాను టిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తూ మానుకొని అభివృద్ధికి సహకరించాలని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేయని అభివృద్ధిని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసుకుంటూ రావడంతో చూసి ఓర్వలేక నిందలు వేయడం సరికాదన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లు ఒక్క గ్రామాన్ని కూడా డబుల్ బెడ్ రూమ్ ఇచ్చిన పాపం కూడా లేదు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి గ్రామంలో కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి లబ్ధిదారులకు డబ్బులను మంజూరు చేసి వారు కూడా గృహప్రవేశం చేసుకుంటున్నారు. దీంతో ప్రజలు చాలా సంతోషంగా ఆనంద పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు, సన్న బియ్యం ఉచిత కరెంటు బిల్లు గ్యాసు, ఆర్టీసీలో ఉచిత సౌకర్యం వంటి సదుపాయాలను కల్పించి కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద ప్రజలకు ఎంతో కృషి చేస్తుందన్నారు.

= కురుమూర్తి ఆలయాన్ని పర్యట కేంద్రంగా తీర్చిదిద్దుతా.

తీవర్ కదరా నియోజకవర్గంలో ఉన్న కురుమూర్తి దేవాలయం పర్యాటక కేంద్రంగా దిద్ది మరో యాదగిరిగుట్ట ఆలయంగా మారుస్తున్నాను ఆయన అన్నారు. కురుమూర్తి దేవాలయం దగ్గర స్థలం కొరతతో ప్రజలకు ఇప్పటికే చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందులను తొలగించి కురుమూర్తి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆయన డిమాండ్ చేశారు. ఇంటిగ్రేడ్ స్కూల్ ని ఎన్ని అడ్డంకులు వచ్చినా చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలో నిర్మించి తీరుతా అక్కడ ఉన్న ఫ్యాక్టరీ ముయించి విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి స్కూల్ ని ఇంటిగ్రేడ్ పాఠశాలను నిర్మించి తీరుతానని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ కథలప్ప, మున్సిపాలిటీ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, మండల నాయకులు కార్యకర్తలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రేక్ అప్ తరవాత అత్యాచార కేసులు కుదరవు

## - తేల్చి చెప్పిన సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)**

సహజీవనం తర్వాత అత్యాచారం కేసులు పెట్టడం సరికాదని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. బ్రేక్-అప్ తర్వాత లైంగిక దాడి ఆరోపణలు వర్తించవని పేర్కొంది. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం నేరం కిందకు రాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. పెళ్లి చేసుకోలేదని కక్షపూరితంగా కేసులు పెట్టడం సరికాదని ధర్మాసనం సూచించింది. తప్పుడు వాగ్దానం, విఫలమైన వాగ్దానాల మధ్య తేడాను గుర్తించాలని కేసు విచారణ సందర్భంగా పిటిషనర్‌కు తెలిపింది. ఈ మేరకు మహారాష్ట్ర న్యాయవాదిపై నమోదైన అత్యాచారం కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇద్దరి వ్యక్తుల బంధంలో ప్రారంభం నుంచీ మోసపూరిత ఉద్దేశం ఉంటేనే నేరం కిందకు వస్తుందని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

# స్నేహితుల మధ్య గొడువ ఒకిరిపై దాడి చేసి హత్య

అనంతపురం,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో ఆదివారం రాత్రి ఒక చిన్న వివాదం పెను విషాదానికి దారితీసింది. కేవలం బైక్ తాళం విషయంలో మొదలైన వాగ్వాదం, ఓ యువకుడి ప్రాణాలను తీసింది. స్నేహితుల మధ్య జరిగిన ఈ ఘర్షణ స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తాడిపత్రి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిపత్రి పట్టణంలోని బంకమట్టి కాలనీకి చెందిన దూదేకుల అబ్దుల్లా, భాష, గౌస్, కార్తీక్‌లు ప్రాణస్నేహితులు. రోజూ వీరంతా కలిసి సరదాగా గడిపేవారు. ఆదివారం రాత్రి వీరి మధ్య ఓ చిన్న విషయంలో మనస్పర్థలు వచ్చాయి. అబ్దుల్లాకు చెందిన బైక్ తాళంచెవిని అతని స్నేహితులు కింద పడవేశారు. ఈ చిన్న విషయంలో అబ్దుల్లాకు ఆయన స్నేహితులైన కార్తీక్, గౌస్‌ల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం మొదలైంది. ఒకరినొకరు దూషించుకోవడంతో గొడవ ముదిరింది. మాట మాట పెరగడంతో ఆవేశానికి లోనైన గౌస్, కార్తీక్‌లు అబ్దుల్లాపై అమానుషంగా ప్రవర్తించారు. విచక్షణ కోల్పోయి పక్కనే ఉన్న పదునైన నాపరాళ్లను తీసుకుని అబ్దుల్లాపై దాడికి దిగారు. ఈ దాడిలో తల, ఇతర భాగాల్లో బలమైన గాయాలు కావడంతో అబ్దుల్లా తీవ్ర రక్తస్రావానికి గురయ్యాడు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అబ్దుల్లా అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న తాడిపత్రి పట్టణ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హత్యకు పాల్పడిన గౌస్, కార్తీక్‌లను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, హత్యకు గల పూర్తి కారణాలు, ఆ సమయంలో అక్కడ ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపై పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు. అబ్దుల్లా మరణంతో బంకమట్టి కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# తాడిపత్రిలో హిజ్రా అనుమానాస్పద మృతి

## - ప్రత్యర్థి వర్గం హత్య చేసి ఉంటుందని అనుమానం

## - దర్యాప్తు చేపట్టిన పోలీసులు

అనంతపురం,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

అనంతపురం జిల్లా తాడిపత్రిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మల్లిక అనే హిజ్రా రైల్వే గేట్ పట్టాలపై శవమై కనిపించడం స్థానికంగా కలకలం సృష్టించింది. ఇది ముమ్మాటికీ హత్యేనని తోటి హిజ్రాలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిపత్రి పట్టణానికి చెందిన మల్లిక అనే హిజ్రా ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. ప్రత్యర్థి వర్గానికి చెందిన కొందరు హిజ్రాలు ఆమెను ఆటోలో బలవంతంగా తీసుకువెళ్లినట్లు సమాచారం. మల్లికను ఆటోలో తీసుకువెళు_న్న దృశ్యాలు స్థానిక సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ వీడియో ఆధారాలు ఇప్పుడు కేసు విచారణలో అత్యంత కీలకంగా మారాయి. ఈ ఫుటేజీ ఆధారంగానే పోలీసులు నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. ఆదివారం రాత్రి చల్లవారిపల్లి రైల్వేగేట్ సమీపంలోని పట్టాలపై ఓ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. అది మల్లిక మృతదేహంగా గుర్తించారు. మల్లిక మరణ వార్త తెలియడంతో తోటి హిజ్రాలు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. మల్లికను పక్కా పథకం ప్రకారం కిడ్నాప్ చేసి, ప్రత్యర్థి గ్రూపునకు చెందినవారే దారుణంగా హతమార్చారని వారు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసులు రంగంలోకి దిగి విచారణ వేగవంతం చేశారు. మల్లిక మృతికి సంబంధించి అనుమానితులుగా భావిస్తున్న శిరీష, సంగీత, రాధ అనే ముగ్గురు హిజ్రాలును అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టారు. హిజ్రా వర్గాల మధ్య ఉన్న గ్రూపు తగాదాలే ఈ హత్యకు దారితీశాయా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తాడిపత్రిలో హిజ్రాల మధ్య తలెత్తిన ఈ ఘర్షణ మరణానికి దారితీయడం చర్చనీయాంశంగా మారింది. మల్లిక మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆమె అనుచరులు డిమాండ్ చేస్తున్నారు.

# అంబర్‌పేట చౌరస్తాలో భారీ అగ్నిప్రమాదం

## - దగ్ధమైన రెండు కారు షోరూమ్‌లు

హైదరాబాద్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

అంబర్‌పేట్ చౌరస్తాలోని రెనో, మహీంద్ర షోరూమ్స్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. ప్రమాదాన్ని పసిగట్టిన వెంటనే షోరూమ్ యజమానులు.. అగ్నిమాపక సిబ్బందితోపాటు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది.. మంటలార్పుతున్నారు. ప్రమాదానికి గురైన షోరూమ్స్ వెనుక వైపు గృహసముదాయాలు ఉన్నాయి. అగ్నికీలలు ఎగసిపడుతుండటం, ప్రమాద తీవ్రత అధికంగా ఉండటంతో.. షోరూమ్స్‌కి ఆనుకుని ఉన్న ఇళ్లలోని ప్రజలను పోలీసులు ఖాళీ చేయించారు . అగ్ని ప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా.. షోరూమ్‌లోని వాహనాలన్నీ దగ్ధమయ్యాయని.. భారీగా ఆస్తి నష్టం కలిగిందని షోరూమ్ యజమానులు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణలో రాజీ లేదు:

# గుబ్బల మంగమ్మ అడవుల్లో ప్లాస్టిక్ పై ఉక్కుపాదం

## - వన్యప్రాణుల మరణాలపై అటవీశాఖ తీవ్ర ఆగ్రహం..

## ఉమ్మడి తనిఖీలు షురూ!









బుట్టయిగూడెం/కామవరం:ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా బుట్టయిగూడెం మండలం కామవరం శివారులోని ఆంధ్ర - తెలంగాణ సరిహద్దు అటవీ ఆలయ పరిసరాలలో ప్లాస్టిక్ వినియోగంపై అటవీ శాఖ అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్లాస్టిక్ మహమ్మారి కారణంగా అడవిలో మూగజీవాలు, పక్షులు ప్రాణాలు కోల్పోతున్నాయని అలాగే భక్తుల నిర్లక్ష్యం వల్లన వన్యప్రాణుల పాలిట శాపంగా మారుతుందని ఫారెస్ట్ అధికారి జె. నరసింహారావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసారు.

### ప్లాస్టిక్ రహిత అడవి - వన్యప్రాణుల సంరక్షణే ధ్యేయం

గురువారం సుమారు 25 వేల మంది, ఆదివారం దాదాపు 65 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారని, ఇంత భారీ సంఖ్యలో వచ్చే భక్తులు వదిలి వెళ్లే ప్లాస్టిక్ వ్యర్థాలను తిని జంతువులు, పక్షులు మృత్యువాత పడుతున్నాయని నరసింహారావు తెలిపారు.

### గత ఏడాది విషాదం:

గత సంవత్సరం ప్లాస్టిక్ వ్యర్థాలను తిని రెండు ఆవులు మృతి చెందడంపై అటవీశాఖ తీవ్రంగా స్పందించి ఇకపై మూగ జీవాలకు ఎవరైనా హాని చేస్తే ఉపేక్షించేది లేదని అలాంటి వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ఆరోగ్యానికి ముప్పు :

ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహారం పెట్టుకోవడం వల్ల విష పదార్థాలు వెలువడి క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు

ప్రత్యామ్నాయం : భక్తులు కేవలం అరిటాకులు, స్టీల్ ప్లేట్లు మాత్రమే వాడాలని, అడవికి ఎట్టి పరిస్థితుల్లోనూ నిప్పు పెట్టకూడదని కోరారు.

### ఉమ్మడి పర్యవేక్షణ - కట్టుదిట్టమైన తనిఖీలు

అటవీ సంరక్షణ కోసం ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.
ముఖ్యంగా: భద్రాద్రి కొత్తగూడెం డి.ఎఫ్.ఓ కృష్ణ గౌడ్
పాల్వంచ ఎఫ్.డి.ఓ కె. దామోదర్ రెడ్డి

### అశ్వారావుపేట ఎఫ్.ఆర్.ఓ ఎం. మురళి

వీరి ముగ్గురి సంయుక్త ఆధ్వర్యంలో అటవీ రక్షణ చర్యలు అత్యంత పకడ్బందీగా కొనసాగుతున్నాయి. ఆంధ్ర - తెలంగాణ చెక్ పోస్ట్ వద్ద రెండు నెలల క్రితమే టోల్ ఏర్పాటు చేశామని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్లాస్టిక్ లోపలికి వెళ్లకుండా చూస్తున్నామని అధికారులు తెలిపారు."చెక్ పోస్ట్ ద్వారా వచ్చే ఆదాయంతో స్థానిక గిరిజన తెగలకు ఉపాధి కల్పిస్తున్నాం అని తెలియజేసారు. అంతేకాకుండా ప్లాస్టిక్ తీసుకొచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని అలాగే రెండు నెలల క్రితం ఈ ఆలయ ప్రాంగణంలో సేకరించిన ప్లాస్టిక్‌ను బయటకు పంపి రీసైక్లింగ్ కుడా చేస్తున్నాం అని జె. నరసింహారావు ఫారెస్ట్ అధికారి తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కోర్స గంగరాజు, ఆలయ కమిటీ సభ్యులు గుజ్జు రామారావు, మన్యం పులి, ఆంధ్ర అటవీశాఖ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.అదేవిధంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తులు పర్యావరణాన్ని కాపాడుతూ అమ్మవారి దర్శనం చేసుకోవాలని కోరారు.

# కుక్కునూరులో ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

## - పంచాయతీలకు చెత్త సేకరణ రిక్షాల పంపిణీ





కుకునూరు, ఏలూరు జిల్లా:ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం)

పరిసరాల పరిశుద్ధమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా, కుక్కునూరు మండల కేంద్రంలో నేడు ఇంటింటికి చెత్త సేకరణ రిక్షాలను పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొని, వివిధ పంచాయతీల నుంచి వచ్చిన పారిశుధ్య కార్మికులకు ఈ రిక్షాలను అందజేశారు.గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు మరియు చెత్త సేకరణ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఈ రిక్షాలను కేటాయించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, వారికి అవసరమైన పరికరాలను అందించడం ద్వారా గ్రామాలు మరింత శుభ్రంగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు మరియు అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు వీరిలో
ములిశెటి యుగంధర్ (జనసేన పార్టీ మండల అధ్యక్షులు)

ములిశెటి నాగేశ్వరావు (నాగు) (తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షులు)
ఎంపీడీఓ మరియు మండల పంచాయతీ కార్యదర్శులు
రమణ రాజు (టీడీపీ సీనియర్ నాయకులు)
సరిహద్దు సత్యనారాయణ (టీడీపీ నాయకులు)
మంత్రి గోపాల కృష్ణ (జనసేన ఉప అధ్యక్షులు)
కుకునూరు సీతారామయ్య (కుకునూరు టౌన్ ప్రెసిడెంట్)
గరగా జగదీశ్ (జనసేన సోషల్ మీడియా కన్వీనర్)
గంధం నాగరాజు (కుకునూరు స్కూల్ చైర్మన్)
లక్ష్మణ్ స్వామి , కృష్ణ (జనసేన నాయకులు) ఈ పంపిణీ కార్యక్రమంలో మండలంలోని వివిధ పంచాయతీల కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు మరియు ఇతర ప్రభుత్వ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రిక్షాల పంపిణీ అనంతరం పారిశుధ్య కార్మికులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

# నేడు రజక మిత్ర మండలి ఆధ్వర్యంలో శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవములు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం న్యూస్)

హన్మకొండ లోని శ్రీ భద్రకాళీ దేవస్థానంలో జరుగుతున్న శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ మహోత్సవం 2026 కార్యక్రమాలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించ బడ్డాయి. ఈ కార్యక్రమాన్ని పురస్కరించు కొని ఉమ్మడి వరంగల్ జిల్లా రజక మిత్ర మండలి అధ్యక్షులు ఓరుగంటి పూర్ణ చందర్ ప్రధాన కార్యదర్శి పాలడుగుల ఆంజనేయులు హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట లో ఉన్న శ్రీ మడేలేశ్వర సహకార సంఘాన్ని నేడు (మంగళవారం) సాయంత్రం జరిగే కార్యక్రమంలో భాగంగా మొదటి సారి రజక కులస్తులచే అంగరంగ వైభవంగా అమ్మవారి కళ్యాణ బ్రహ్మోత్సవాల నిర్వహణానికి ఆహ్వానించడం జరిగింది. అనంతరం రజక కులస్తులు పాలకవర్గాన్ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలేపల్లి రాజు (మైకెల్) సాంబయ్య, సదానందం, శేఖర్, తిరుపతి, వినయ్, గంగరాజు, వెంకటేష్, కళ్యాణ్, సతీష్, రమేష్, నరేష్, ఐలయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలేపల్లి రాజు మైకల్



మాట్లాడుతూ రజకులను చిన్న చూపు చూసే తరుణంలో ఈసారి భద్రకాళి దేవస్థానంలో జరుగు కార్యక్రమాలలో మాకు అవకాశం కల్పించినందుకు చాలా సంతోషంగా ఉందని భద్రకాళి అమ్మవారి కృప కటాక్షములు అందరిపై ఉండాలని కోరారు.

# పెరిగిన బంగారం ధరలు

ముంబై,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

బంగారం ధరలు మరోమారు పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం హైదరాబాద్ మార్కెట్‌లో సోమవారం ఉదయం పది గంటల ప్రాంతంలో బంగారం ధరలు ఇలా ఉన్నాయి. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,54,420 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,41,550 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,15,820 వద్ద ట్రేడ్ అవుతోంది.

# త్యాగాల పునాదులపై ఏర్పడ్డదే బిఆర్ఎస్

## 14 ఏళ్ల పోరాటంలో తెలంగాను ఐక్యం చేసిన జెండా ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

దశాబ్దాలుగా అన్యాయనికి గురై నెత్తురు మండిన జాతి ఎత్తిన జెండానే గులాబీ జెండా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. త్యాగాల పునాదులపై ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. జై కేసీఆర్, జైతెలంగాణ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..స్వీయ రాజకీయ శక్తిగా ఎదిగనప్పుడే సమస్యలకు చరమగీతం పాడవచ్చన్నారు. కేసీఆర్25 ఏండ్ల క్రితం జలదృశ్యంలో గులాబీ జెండా ఎత్తిపట్టారని గుర్తు చేశారు. 14 ఏండ్ల తన పోరాటంతో తెలంగాణ జాతిని ఐక్యం చేసి సబ్బండ వర్ణాలను ఏకతాటిపైకి తెచ్చి తెలంగాణ కలను సాకారం చేశారన్నాను. అడుగడుగునా పోరాటాలు చేస్తూ దిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్ఎస్ అని కేటీఆర్ అన్నారు. పదేళ్ల పాలనలో మాజీ సీఎం కేసీఆర్.. రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలబెట్టారన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ జెండా ఎగురవేశారు. కాంగ్రెస్, భాజపా పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించి.. మళ్లీ బీఆర్ఎస్‌ను పట్టాలెక్కించేందుకు పోరాటం చేస్తామని వెల్లడించారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు పార్టీ పునరంకితం అవుతుందని అన్నారు. సాధించిన తెలంగాణ కోసం అధికారం అప్పగిస్తే పదేండ్ల కాలంలో బాధ్యతగా పని చేసి అన్ని రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. కానీ, రెండున్నర ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఆరాచక పాలన మొదలైందన్నారు. కాంగ్రెస పాలనకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల తరఫున పోరాడుతున్నది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఏ బాధ్యత అప్పగించినా బీఆర్ఎస్ పార్టీ సమర్ధవంతంగా నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ ప్రజలకు స్వీయ రాజకీయ అస్తిత్వం ఉండాలని ప్రొ.జయశంకర్ అనేవారు. తెలంగాణ ప్రజలను కాంగ్రెస్, బీజేపీ నుంచి రక్షించుకునేందుకు ఐక్యంగా పోరాడుదామన్నారు. 2028లో మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చేసేదాకా దండుగా కదం తొక్కుదామని పిలుపునిచ్చారు. కేసీఆర్ దిశానిర్దేశర కోసం గులాబీ దండు ఎదురుచూస్తోందన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వారియర్స్, పార్టీ కార్యకర్తలకు, జర్నలిస్టులకు,కవులు, కళాకారులు, ఉద్యోగులు సమస్త ప్రజానికానికి వినమ్ర ధన్యవాదాలు తెలిపారు.



# జిల్లాలో ఇంధన కొరత తలెత్తకూడదు - కలెక్టర్ కె. వెట్రిసెల్వి

## - బంకులకు వెంటనే ట్యాంకర్లు పంపాలని ఆయిల్ కంపెనీలకు ఆదేశం

ఏలూరు, ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లాలోని ఏ పెట్రోల్ బంకులోనూ పెట్రోల్, డీజిల్ కొరత తలెత్తకుండా చూడాలని, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను క్రమబద్ధీకరించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆయిల్ కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుండి వివిధ ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె జిల్లాలోని ఇంధన నిల్వలు, సరఫరా అంశాలపై సమీక్షించారు.

**ముందస్తు చర్యలు తప్పనిసరి:**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బంకుల్లో ఇంధన నిల్వలు పూర్తిగా అయిపోయే వరకు వేచి చూడకుండా, ముందస్తుగానే నిల్వలను గుర్తించి ఇండెంట్ పెట్టేలా యజమానులను అప్రమత్తం చేయాలన్నారు.

**తక్షణ సరఫరా:**

బంకు యజమానులు ఇండెంట్ పెట్టిన వెంటనే ఆయిల్ కంపెనీలు ట్యాంకర్లను పంపేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

**ప్రజల్లో భరోసా :**

డీజిల్ కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో ప్రజలు అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారని, జిల్లాలో తగినన్ని నిల్వలు ఉన్నాయని వారిలో నమ్మకాన్ని కలిగించాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందని స్పష్టం చేశారు.




**అధికారుల సమన్వయం:**

జిల్లాలో పెట్రోల్, డీజిల్ డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, ట్రైనీ కలెక్టర్ సిహెచ్ శ్రవణ్ కుమార్ రెడ్డి, పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు. అలాగే ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం, నయారా ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని జిల్లాలోని ప్రస్తుత పరిస్థితిని కలెక్టర్‌కు వివరించారు.

# విశాఖకు చేరుకున్న లోకేశ్

## - ఘనంగా స్వాగతం పలికిన టిడిపి నేతలు

విశాఖపట్నం,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఘనంగా స్వాగతం లభించింది. నగరానికి విచ్చేసిన మంత్రికి టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. టీడీపీ నేత చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్ (వైజాగ్)' అంటూ ప్లకార్డులు పట్టుకుని ఘనంగా స్వాగతించారు. ఎయిర్‌పోర్టు వద్ద మంత్రి లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు, గూగుల్ ప్రతినిధుల తేనీటి విందులో పాల్గొనేందుకు నగరానికి లోకేశ్ వచ్చారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఈరోజు సాయంత్రం 4 గంటల నుంచి ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు నాయుడు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. కార్యక్రమానికి హాజరుకానున్న పలువురు ప్రముఖులకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ స్వాగతం పలకనున్నారు. మరోవైపు ఈ రోజు రాత్రి నోవాటెల్ హోటల్‌లో గూగుల్ ప్రతినిధుల గౌరవార్థం తేనీటి విందులో మంత్రి లోకేశ్ పాల్గొంటారు.




# ఎపికి పెట్టుబడులు రావడంతో జగన్‌కు ఈర్ష్య

## - ఐదేళ్ల పాటు డార్క్ రూమ్ పాలనతో గడిపారు
## - జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి వాసంశెట్టి సుభాష్

అమరావతి,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, పరిశ్రమలు చూసి మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని ఏపీ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ మండిపడ్డారు. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు డార్క్ రూమ్ పాలన చేసిన జగన్.. గొప్ప క్రెడిట్ సాధించారని అన్నారు. జగన్ క్రెడిట్లను ఏపీ ప్రజలు తట్టుకోలేక అసెంబ్లీ ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ప్రజలు ఓట్లతో బుద్ధి చెప్పినా జగన్ మాత్రం విష ప్రచారాలు ఆపట్లేదని మంత్రి వాసంశెట్టి ఆగ్రహించారు. మునుపెన్నడూ చూడని వింత ప్రవర్తనతో జగన్ సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నారని మంత్రి వాసంశెట్టి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆంధప్రదేశ్ రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు చూసి ఓర్వలేక జగన్ బాధపడుతున్నారని చెప్పారు. క్రెడిట్ చోరీలో జగన్ సిద్ధహస్తుడంటూ విమర్శలు గుప్పించారు మంత్రి. ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని నాశనం చేసిన క్రెడిట్ జగన్‌కు మాత్రమే సొంతమన్నారు. ఏపీకి రాజధాని లేకుండా చేయడంతో పాటు అన్ని రంగాలను నాశనం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. పెద్దపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు మొదలు.. చిన్న కంపెనీల వరకూ యాజమాన్యాన్ని వేధించారని మంత్రి ఆరోపించారు. దాదాపు 40కి పైగా కంపెనీలను ఏపీ వదిలి పారిపోయేలా చేసిన క్రెడిట్ జగన్‌దే అని మంత్రి వాసంశెట్టి ఆరోపించారు. హత్యా రాజకీయాలు, కల్తీ మద్యం, ఇసుక అక్రమ దందా ఇలా జగన్, ఆయన అనుచరుల క్రెడిట్‌ను ఎవరూ కాపీ చేయలేరని అన్నారు. జగన్ తన మానసిక బాధ తగ్గించుకునేందుకు యోగా లాంటి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని మంత్రి వాసంశెట్టి వ్యంగ్యంగా అన్నారు.

# ఊరూరా ఎగిరిన బిఆర్ఎస్ జెండా

హైదరాబాద్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ జెండా పండుగ వాడవాడలా పండుగలా కొనసాగింది. తెలంగాణ రాష్ట్రమే లక్ష్యంగా ఉద్యమ సంస్థగా ఆవిర్భవించిన బీఆర్ఎస్ పార్టీ లక్ష్యాన్ని సాధించి, రాష్ట్రం పురోగతి సాధించిన గులాబీ జెండా 25 వసంతాలు పూర్తిచేసుకుని 26 వసంతంలోకి అడుపెట్టింది. తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంది. భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా పల్లెలు, పట్నాలు, ఆయా ప్రాంతాల పార్టీల కార్యాలయాల్లో ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు గులాబీ జెండాలు ఎగరవేసి పటాకులు కాల్చి, స్వీట్లు పంచి పెట్టి సంబురాలు జరుపుకున్నారు. జైతెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తించారు.



ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS

28 మంగళవారం, ఏప్రిల్ 2026 | 9 | www.prajaveekshanam.in

# అమెరికా అధ్యక్షుడిపై కాల్పుల ఘటన

## - భద్రతపై ఉలిక్కి పడేలా చేసిన వ్యక్తి


## - ట్రంప్‌పై వ్యతిరేతతోనే దాడికి యత్నం

## - నోట్ ద్వారా ప్లాన్ వెల్లడించిన దాడి నిందితుడు

వాషింగ్టన్,ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న శ్వేతసౌధం కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కాల్పుల ఘటన నిందితుడు కోల్ టొమాస్ అలెన్ గురించి కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. అతడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా దాడికి ముందే ఓ నోట్‌ను తయారుచేసి, దానిని కుటుంబసభ్యులకు పంపాడు. ట్రంప్ గురించి....పిల్లలను లైంగికంగా వేధించే వ్యక్తి, రేపిస్ట్, ద్రోహి వంటి పదాలను అందులో వాడాడని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అలాంటి లక్షణాలున్న వ్యక్తిని ఏమాత్రం అంగీకరించను అని ఆ నోట్‌లో నిందితుడు రాసుకున్నాడు. అలాగే తాను ఎవరిని టార్గెట్ చేయాలను కున్నాడో ఒక జాబితాను సిద్ధం చేసుకున్నాడు. తన జోలికి రానంతవరకు అతిథులు, ఇతర సిబ్బందిని, సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లపైనా కాల్పులు జరపనని పేర్కొన్నాడు. అలాగే హోటల్ భద్రత ఘోరంగా ఉందని, తాను భారీ రైఫిల్‌ను తెచ్చినా ఎవరూ గుర్తించేవారు కాదంటూ నిందితుడు వ్యాఖ్యా నించాడు. ఇక కాల్పుల ఘటన అనంతరం అధ్యక్షుడు మీడియాతో మాట్లాడుతూ.. నోట్‌లో ఉన్న ఆరోపణలను తోసిపుచ్చారు.

నిందితుడు రాసుకున్నది మీ గురించే అని భావిస్తున్నారా..? అని మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. అతడే దానిని రాసుకున్నాడు. కానీ నేను రేపిస్ట్‌ని కాను. ఏమాత్రం సంబంధం లేనివాటిని నాకు ముడిపెట్టారు. నేను నిర్దోషిని అంటూ తనను ప్రశ్నించిన రిపోర్టర్‌పై అసహనం వ్యక్తంచేశారు. ప్రస్తుతం నిందితుడు రాసుకున్న అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ట్రంప్ యంత్రాంగంలోని అధికారులను లక్ష్యంగా చేసుకోవాలని అతడు ప్రయత్నించినట్లు వెల్లడవుతోందని అధికారులు పేర్కొన్నారు. ఇకపోతే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మరోసారి హత్యాయత్నం జరిగింది. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో త్రుటిలో ఆయన, సతీమణి మెలనియా, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దంపతులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. తుపాకులు, కత్తులతో వచ్చిన ఆగంతుకుడు 'శ్వేతసౌధం విలేకరుల సంఘం' విందు జరుగుతున్న హోటల్‌లోని బాల్‌రూంవైపు వెళ్తూ కాల్పులకు దిగడంతో ఒక్కసారిగా భీతావహ వాతావరణం నెలకొంది. ట్రంప్‌ను రక్షించడానికి సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ఆగమేఘాలపై స్పందించగా.. కాల్పుల చప్పుళ్లు వినగానే ప్రాణభయంతో పలువురు అతిథులు టేబుళ్ల కింద దాక్కోవాల్సి వచ్చింది. నిందితుడు కోల్ టొమాస్ అలెన్‌ను (31) అక్కడికక్కడే నిర్బంధంలో తీసుకుని సంకెళ్లు వేశారు. అతడి వద్ద ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన ఉలిక్కి పడేలా చేసింది. ఘటన తర్వాత కూడా విందు కొనసాగించాలని ట్రంప్ గట్టిగా భావించినా.. భద్రతాధికారులు ఆ ప్రాంగణాన్ని తక్షణం ఖాళీ చేయడమే మేలని సూచించి ఆయనను శ్వేతసౌధానికి తరలించారు. ట్రంప్‌పై దాడికి ప్రయత్నించడం రెండేళ్లలో ఇది మూడోసారి.







# చర్చలకు పాక్ సరైన మధ్యవర్తి కాదు

## - పాక్ సమర్థతపై ఇరాన్ అధికారుల్లో అనుమానాలు

టెహ్రాన్,ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం)

అమెరికా–ఇరాన్ మలివిడత చర్చలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మధ్యవర్తిగా పాకిస్థాన్ తటస్థ వైఖరితో సమర్థవంతంగా వ్యవహరించగలదా అని టెహ్రాన్ అధికారిక వర్గాల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇరాన్ పార్లమెంట్‌లో ఆ దేశ ఎంపీ, జాతీయ భద్రత విదేశాంగ విధాన కమిషన్ అధికార ప్రతినిధి అయిన ఇబ్రహీం రెజాయీ మాట్లాడుతూ.. పాక్ సరైన మధ్యవర్తి కాదనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇస్లామాబాద్‌లో దౌత్యానికి అనుకూల పరిస్థితులు లేవని అన్నారు. పొరుగు దేశమైన పాకిస్థాన్ మనకు మంచి మిత్ర దేశం. కానీ అది చర్చలకు సరైన మధ్యవర్తి కాదు. మధ్యవర్తిత్వానికి అవసరమైన విశ్వసనీయత దానికి లేదు. పాక్ అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ప్రవర్తిస్తుందే కానీ.. ఆ దేశ వైఖరిని సవాలు చేయడానికి సాహసించదు. లెబనాన్ విషయంలో అమెరికా అంగీకరించలేనివిధంగా డిమాండ్లు తెర పైకి తీసుకువచ్చినప్పుడు కూడా పాక్ నేతలు అడ్డు చెప్పలేదు. మధ్యవర్తులు నిష్పక్షపాతంగా ఉండాలి కానీ.. ఒక పక్షం వైపు మొగ్గు చూపకూడదు. ఇప్పటివరకు వారి విధానం చూస్తుంటే చర్చల విషయంలో వారు నిష్పక్షపాతంగా వ్యవహరించగలరా అనే దానిపై సందేహాలు తలెత్తుతున్నాయని ఇబ్రహీం రెజాయీ పార్లమెంట్‌లో పేర్కొన్నారు. అమెరికా–ఇరాన్‌ల మధ్య తొలివిడత చర్చలు విఫలమైన తర్వాత మళ్లీ చర్చలు జరపాలని ఇరాన్ ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. శాంతిఒప్పందం కుదిరేవరకు ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని ఉపసంహరించుకోబోమని అమెరికా చెబుతుండగా.. దాన్ని తొలగించేవరకూ చర్చలు జరపబోమని ఇరాన్ స్పష్టం చేస్తోంది. కాగా తమ మధ్యవర్తిత్వంలో ఇరువర్గాల మధ్య పరోక్ష చర్చలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పాక్ అధికారులు పేర్కొన్నారు.

# ఇరాన్ దాడుల నుంచి రక్షణకు

## - యూఏఇకి ఇజ్రాయిల్ ఐరన్ డోమ్

## - అమెరికా పత్రిక సంచలన కథనం

న్యూయార్క్,ఏప్రిల్ 27 (ప్రజా వీక్షణం)

పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు రగులుతున్న వేళ యూఏఈని ఇజ్రాయిల్ అనూహ్యంగా ఆదుకొంది. యుద్ధం ప్రారంభమైన తొలినాళ్లలో ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను యూఏఈ తన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో అడ్డుకొంది. కానీ, కొన్ని ఇరాన్ ఆయుధాలు కీలక మౌలిక వసతులపై దాడులు చేయడంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మిత్రదేశాల సాయం కోరింది. దీంతో ఇజ్రాయెల్ ముందుకొచ్చి దానికి సాయం చేసినట్లు అమెరికా పత్రిక సంచలన కథనం ప్రచురించింది. ఇజ్రాయెల్ తన ఐరన్‌డోమ్ వ్యవస్థను యూఏఈకి పంపించడంతోపాటు.. దానిని ఆపరేట్ చేసి రాకెట్లు, డ్రోన్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు తమ దళాలను కూడా అక్కడికి తరలించింది. ఇరాన్ దాడుల తీవ్రత పెరగడంతో యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జయేద్ నుంచి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ఫోన్‌కాల్ వెళ్లింది. ఆ తర్వాతే ఐరన్ డోమ్ వ్యవస్థను యూఏఈకి తరలించాలని ఇజ్రాయెల్ ప్రధాని నుంచి ఐడీఎఫ్ దళాలకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో ఇరాన్ దాడులకు ప్రధాన టా÷–గ్గ÷ట్‌గా మారిన అబుదాబికి ఊరట లభించింది. దీంతో డజన్లకొద్దీ ఇరాన్ క్షిపణులను యూఏఈ ఈ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో అడ్డుకొంది. ఇరాన్ ఈ యుద్ధ సమయంలో మొత్తం ఆ దేశంపై 550 బాలిస్టిక్ క్షిపణులు, 2,200 డ్రోన్లు ప్రయోగించినట్లు అబుదాబి రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ చర్యతో ఇజ్రాయెల్–యూఏఈ మిత్రత్వం మరింత పెరిగినట్లు అమెరికా మీడియా సంస్థ వెల్లడించింది. ఇప్పటివరకు ఇజ్రాయెల్ దేశం బయట తన సొంత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను మోహరించింది యూఏఈలోనే. అయితే అమెరికా కూడా తన సొంత ఐరన్ డోమ్‌ను వాడుతోంది.

# మెదక్ జిల్లాలో ట్రావెల్ బస్సు దగ్ధం

## - ఘటనపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు

మెదక్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)



మెదక్ జిల్లాలోని మాసాయిపేట వద్ద ఎన్‌హెచ్ –44పై ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. ఈ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఈ ఘటన జరిగింది. అదృష్టవశాత్తూ డ్రైవర్, క్లీనర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో సాంకేతిక సమస్య తలెత్తడంతో, దానిని రిపేర్ చేయించడం కోసం హైదరాబాద్ నుంచి మెదక్ తీసుకువచ్చారు. రిపేర్ పనులు పూర్తయిన తర్వాత సోమవారం తెల్లవారుజామున డ్రైవర్, క్లీనర్ బస్సును తీసుకుని తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. మాసాయిపేట పరిసర ప్రాంతాల్లో ప్రయాణిస్తుండగా, బస్సు ఇంజిన్ భాగం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. మంటలు నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తానికి వ్యాపించాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో డ్రైవర్, క్లీనర్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా బస్సులో నుంచి కిందకు దూకేశారు. దీంతో వారు క్షేమంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు గంటసేపు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే, అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయా? లేదా రిపేర్ పనుల్లో ఏవైనా లోపాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదింపు

## - రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు

హైదరాబాద్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం రెండో టెర్మినల్‌కు సోమవారం బాంబు బెదిరింపు వచ్చింది. సమాచారం అందిన వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు టెర్మినల్ అంతటా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రతి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ తనిఖీల తర్వాత ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఇది ఫేక్ ఈ –మెయిల్ అని నిర్ధారించారు. బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు. మెయిల్ సోర్స్, ఐపీ అడ్రస్ తదితర వివరాలను ట్రాక్ చేసే పనిలో ఉన్నారు. తనిఖీల సమయంలో కాసేపు విమానాశ్రయంలో భద్రతా జాగ్రత్తలు చేపట్టినప్పటికీ, సాధారణ విమాన సేవలకు పెద్ద అంతరాయం కలగలేదని అధికారులు తెలిపారు. ఇది ఫేక్ ఈ –మెయిల్ అని తేలడంతో విమానాశ్రయ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఫోటో జర్నలిస్ట్ రఘురాయ్ మృతికి మోడీ సంతాపం

## - క్రియేటివ్ దిగ్గజంగా గుర్తుండిపోతారని కితాబు

న్యూఢిల్లీ,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

ప్రముఖ భారతీయ ఫోటో జర్నలిస్ట్ రఘు రాయ్ మృతికి ప్రధాని మోడీ సంతాపం ప్రకటించారు. ఆదివారం ఆయన కన్నుమూసిన సంగతి తెలిసిందే. క్యాన్సర్ మహమ్మారితో పాటు వృద్ధాప్య సంబంధిత సమస్యల కారణంగా 83 ఏళ్ల వయసులో ఆయన ప్రాణాలు కోల్పోయారు. రఘు రాయ్ మరణంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. సోమవారం ఎక్స్ వేదికగా ఆయనకు నివాళులర్పించారు. రఘు రాయ్ భారతదేశ జీవనశైలిని తన కెమెరా ద్వారా అద్భుతంగా బంధించిన క్రియేటివ్ దిగ్గజంగా గుర్తుండిపోతారని ప్రధాని పేర్కొన్నారు. మోదీ తన పోస్టులో..పేర్కొన్నరు. రఘు రాయ్ ఫోటోగ్రఫీలో అసాధారణమైన సున్నితత్వం, వైవిధ్యం ఉండేవి. ఆయన ఫొటోగ్రఫీ భారతదేశంలోని వివిధ జీవన పార్శ్వాలను ప్రజలకు చేరువ చేసింది. రఘు రాయ్ మరణం ఫొటోగ్రఫీ, సాంస్కృతిక ప్రపంచానికి తీరని లోటు. ఈ విషాదకర సమయంలో నా ఆలోచనలు ఆయన కుటుంబసభ్యులు, అభిమానులు, ఫోటోగ్రఫీ రంగానికి చెందిన వారితో ఉన్నాయి. ఓం శాంతి' అని రాసుకొచ్చారు. రఘు రాయ్ 1942లో పంజాబ్‌లోని ఝంగ్‌లో జన్మించారు. సివిల్ ఇంజినీరింగ్ చేసిన ఆయన 23 ఏళ్ల వయసులోనే ఫొటోగ్రఫీ వైపు వచ్చారు. 'ద స్టేట్స్‌మన్' వార్తా పత్రికలో ఫొటోగ్రాఫర్‌గా చేరారు. దాదాపు 60 ఏళ్ల పాటు ఫోటోగ్రాఫర్‌గా కొనసాగారు. ఎన్నో అద్భుతమైన చిత్రాలను ఆయన తీశారు. దేశంలో చోటుచేసుకున్న ఎన్నో ముఖ్య ఘట్టాలను, విషాదాలను తన కెమెరాతో బంధించారు. దలైలామా, మదర్ థెరీసా, సత్యజిత్ రే, హరి ప్రసాద్ చౌరాసియా, బిస్మిల్లా ఖాన్ వంటి ప్రముఖుల జీవితాల్లోని అరుదైన కోణాలను కెమెరాతో స్పృశించారు.

# చంద్రబాబు ఆదేశాలతో కదిలిన అధికారులు

## - బంకుల్లోకి చేరుతున్న పెట్రో, డీజిల్

## - రవాణా వ్యవస్థకు ఆటంకం రావద్దన్న మంత్రి

అమరావతి,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

ఇంధన సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. గత నాలుగు రోజుల నుంచి నందిగామలో డీజిల్, పెట్రోల్ లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎం ఆదేశాలతో నందిగామలో పలు బంకులకు పెట్రోల్, డీజిల్ చేరింది. పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు భారీగా క్యూ కట్టారు.సోమవారం సాయంత్రానికి అన్ని బంకులకు పెట్రోల్, డీజిల్ చేరుతుందని అధికారులు స్పష్టం చేశారు. పెట్రోల్ బంక్ నుంచే అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇంధన సమస్యతో రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. క్యానుల్లో కొట్టాలంటే వీఆర్వో దగ్గర లెటర్ తీసుకోవాలని అధికారులు తెలిపారు. తమను పట్టించుకోవట్లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు వీఆర్వో లెటర్ కావాలంటే అది తీసుకువచ్చి ఎప్పుడు కొట్టించుకోవాలని రైతన్నలు ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో తాత్కాలిక అంతరాయాలు ఉన్నప్పటికీ రవాణా సేవలు ఆగకూడదని అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. రవాణా సంస్థలు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశర చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రవాణా సంస్థలు తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో తాత్కాలిక అంతరాయాలు ఉన్నప్పటికీ, ప్రయాణికుల సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సులు, ఇతర రవాణా సేవలు నిరంతరంగా కొనసాగించాలని వ్యాఖ్యానించారు. రవాణా సంస్థలు, ప్రైవేట్ ఆపరేటర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడైనా నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులకు అసౌకర్యం కలిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఆందోళన చెందకుండా తమకు సహకరించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు.

# శేషాచల కొండల్లో కార్చిచ్చు

తిరుపతి,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

శేషాచల కొండల్లో కార్చిచ్చు రేగింది.తిరుపతి శివారు ప్రాంతమైన జీవకోన పైభాగంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో అనూహ్యంగా మంటలు చెలరేగాయి. ఆ అగ్నిజ్వాలలు కిలోమీటర్లమేర వ్యాపించడంతో అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.అయితే రాత్రి 10గంటలకు కూడా మంటలు అదుపులోకి రాలేదు.రాత్రికే మంటలను అదుపులోకి తీసుకొస్తామని తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి చెప్పారు.మంటలు ఎలా వ్యాపించాయనేది తెలియాల్సి ఉందన్నారు.

# రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యం

## - విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గించేలా చర్యలు- విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)



విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. యూనిట్ ధరను రూ. 4.60కు తగ్గించేలా కసరత్తు చేస్తోంది. సోమవారం నాడు విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులకు సీఎం కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈవీ వాహనాల వినియోగంపై ప్రజల్లో విస్తృత స్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. ఇంధన రంగంలో పరిశోధనకు ప్రత్యేక ఎనర్జీ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. పీఎం సూర్య ఘర్, కుసుమ్ పథకాల అమలులో లక్ష్యాలు చేరుకునేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. విద్యుత్ వినియోగ దారులకు, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌మిషన్ నష్టాలను గణనీయంగా తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఎంఓయూలు కుదుర్చుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ సహా సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇప్పటికే కుదుర్చుకున్న ప్రాజెక్టులు 60 రోజుల్లోపు కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని వారికి ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలతోపాటు ప్రజల్లో విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని.. అందుకోసం విద్యుత్ పొదుపు ఉపకరణాల వినియోగాన్ని ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందించాలని విద్యుత్ శాఖ అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. గత ప్రభుత్వ అసమర్థత కారణంగా విద్యుత్ రంగం అస్తవ్యస్తమైందని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ముఖ్యంగా పీపీఏల రద్దు నిర్ణయంతో ప్రజలపై రూ. 9,000 కోట్ల భారం పడిందని విమర్శించారు. విద్యుత్ వినియోగించకుండానే ఆ మొత్తాన్ని కంపెనీలకు చెల్లించడం వైసీపీ ప్రభుత్వం చేసిన గొప్ప తప్పిదమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని సరిదిద్దుతూ ఎలాంటి టారిఫ్ పెంపు లేకుండా ప్రజలు ఇబ్బంది పడకుండా సమర్థవంతంగా విద్యుత్ వ్యవస్థను నడిపిస్తున్నామన్నారు. ఈ సమీక్షలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ట్రాన్స్‌కో, జెన్‌కో ఉన్నతాధికారులు హాజరయ్యారు.



# బిఆర్ఎస్‌కు గతమే..భవిష్యత్ లేదు

## - ఉద్యమంలో ఏది మాట్లాడినా చెల్లింది
## - కవిత పార్టీ కుటుంబ గూడుపుఠాణి
## - కెసిఆర్ ఆరోగ్యంగా ఉండాలనే కోరుకుంటా
## - ఆయన చావాలని తానెప్పడూ కోరుకోలేదు
## - కాళేశ్వరంపై సిబిఐ విచారణ తరవాతే చర్యలు
## - మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

బీఆర్ఎస్ పార్టీకి గతం ఉంది.. భవిష్యత్ లేదని, ఉద్యమ సమయంలో అప్పుడు ఎలా మాట్లాడినా ప్రజలు సహించారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్‌గా మాట్లాడారు. కవిత కొత్త పార్టీ ఏర్పాటుపైనా ఆయన స్పందించారు. కేసీఆర్ కుటుంబమంతా ఒక్కటే అని విమర్శించారు. వాళ్లు తెచ్చిపెట్టుకున్న నటనను ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పార్టీకి మనుగడ లేదు. అధికారంలో ఉన్న పదేళ్లు కూడా అలాగే మాట్లాడారు. కేసీఆర్ కుటుంబానికి, బీఆర్ఎస్ పార్టీకి ప్రజలతో సంబంధాలు లేవు. కేసీఆర్ విశ్రాంతిలో ఉన్న ప్రజాప్రతినిధి. ఆయన చావును నేనెందుకు కోరుకుంటానన్నారు. ఆయన ఆరోగ్యంగా ఉంటేనే మాకు మంచిది. ఆయన మర మనిషో కాదో.. కుటుంబ సభ్యులకే తెలుసు. వివక్ష లేని పాలన మాది.. మాకు ప్రతిపక్షమే లేదు అని సీఎం అన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుపట్టలేదని సీఎం అన్నారు. సాంకేతిక లోపాలున్నాయని మాత్రమే చెప్పిందని.. నివేదిక ఆధారంగా చర్యలు వద్దని కోర్టు చెప్పిందన్నారు. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ తర్వాతే చర్యలు ఉంటాయన్నారు.మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యంపై తాను ఎప్పుడూ నెగటివ్‌గా ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, శత్రువు కాదని అన్నారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండటం తనకే మంచిదని, రాజకీయంగా ఎదుర్కోవడం సులభమవుతుందని వ్యాఖ్యానించారు. విశ్రాంతి తీసుకుంటున్న ప్రజా ప్రతినిధి గురించి చెడు కోరుకోవడం తన స్వభావం కాదని తెలిపారు. కేసీఆర్‌కు గాయమైనప్పుడు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించానని, అసెంబ్లీకి వచ్చినప్పుడు కూడా ఆయన్ను కలిసి యోగక్షేమాలు అడిగానని రేవంత్ రెడ్డి తెలిపారు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా గౌరవం ఉందని పేర్కొన్నారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ బతికి ఉంటే తమకు అధికారం రాదని ఆయన కుటుంబ సభ్యులే భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేటీఆర్ ముఖ్యమంత్రి కావాలని మంత్రులతో ప్రకటనలు చేయించారని ఆరోపించారు. అధికార పంపకాల విషయంలో తేడాలు రావడంతో కుటుంబంలో విభేదాలు వచ్చాయని అన్నారు. అయితే, వాళ్లంతా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. అనుబంధ సంఘాలను ప్రభుత్వంపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను ఇప్పటికే రెండుసార్లు ఓడించానని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు ఓటమి కొత్త విషయం కాదని, అలాగే గెలుపు కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని అన్నారు. మహేష్ గౌడ్ వర్సెస్ కేసీఆర్‌గా జరిగిన స్థానిక సంస్థల పోరులో కూడా కేసీఆర్ ఓటమి చవిచూశారని గుర్తు చేశారు. తాము వివక్ష లేకుండా ప్రభుత్వం నడుపుతున్నామని, అన్ని వర్గాల ప్రజలకూ సమన్యాయం చేస్తూ పాలన కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# మహిళా న్యాయవాదిపై భర్త కత్తితో దాడి

## - సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు- సమగ్ర దర్యాప్తునకు ఢిల్లీ పోలీసులకు ఆదేశం

న్యూఢిల్లీ,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

మహిళా న్యాయవాదిపై భర్త కత్తితో దాడి చేసిన ఘటనపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ ఘటనపై సంక్షిప్త విచారణ చేపట్టింది. కేసు రిజిస్టర్ చేసి సీనియర్ అధికారిణులతో దర్యాప్తు చేయించాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ధర్మాసనం ఆదేశించింది. ఎస్పీ లేదా డీఎస్పీ ర్యాంకు అధికారిణులతో మాత్రమే దర్యాప్తు చేయించాలని స్పష్టం చేసింది. బాధితురాలి తరఫున అడ్వకేట్ స్నేహ కలిత బెంచ్ ముందు మాట్లాడుతూ.. 'ఓ మహిళా న్యాయవాది అతి దారుణంగా కత్తి దాడికి గురయ్యారు. అది కూడా భర్త ఆఫీస్‌లో ఆమె కత్తి దాడికి గురయ్యారు. ఆమె చికిత్స కోసం మూడు ఆస్పత్రుల దగ్గరకు వెళితే.. చికిత్స చేయడానికి ఆస్పత్రులు ఒప్పుకోలేదు' అని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. గాయపడిన బాధితురాలిని చేర్చుకునేందుకు నిరాకరించిన మూడు ఆస్పత్రుల విషయంపై కూడా దర్యాప్తునకు ఆదేశించింది. గాయపడ్డ లాయర్‌కు ఆర్థిక సాయం అందేలా చూడాలని అధికారులకు సూచించింది. తదుపరి విచారణ సమయంలో కేసు దర్యాప్తునకు సంబంధించిన వివరాలను వెల్లడించాలని తెలిపింది. కాగా, ఢిల్లీ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ మధు రాజ్‌పుత్ ఆదివారం భర్త చేతిలో కత్తి దాడికి గురయ్యారు. ఈ విషయంపై నిన్ననే చీఫ్ జస్టిస్ సూర్య కాంత్‌కు ఓ లేఖ అందింది. ఆ లేఖ అందిన వెంటనే ఆయన సుమోటో కేసు రిజిస్ట్రర్ చేయాలని ఆదేశించారు.

# అలుపెరగని పోరాటంతో లక్ష్యసాధన

## - తెలంగాణ కలను సాకారం చేసిన బిఆర్ఎస్
## - పార్టీ ఆవిర్భావం సందర్భంగా కెటిఆర్, హరీష్‌ల ట్వీట్లు

హైదరాబాద్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

తెలంగాణ రాజకీయ యవనికపై అలుపెరుగని పోరాట పటిమతో, స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన భారత రాష్ట్ర సమితి నేటితో 25 వసంతాలను పూర్తి చేసుకుని, 26వ ఏట అడుగుపెట్టింది. ఈ మైలురాయిని పురస్కరించుకుని ఆ పార్టీ అగ్రనేతలు, మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ రాజకీయ పార్టీ కాదని.. ఓ విప్లవమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేటీఆర్ తన సందేశంలో బీఆర్ఎస్ ప్రస్థానాన్ని ఒక మహోజ్వల విప్లవంగా అభివర్ణించారు. నెత్తురు మండి ఒక జాతి ఎత్తిన జెండాగా, స్వీయ రాజకీయ అస్తిత్వ పతాకం నేటికి 25 వసంతాల మైలురాయిని అధిగమించిందని పేర్కొన్నారు. సిల్వర్ జూబ్లీ ముగింపు వేడుకల సందర్భంగా కార్యకర్తలకు, సోషల్ మీడియా వారియర్లకు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ ఓ రాజకీయ పార్టీ మాత్రమే కాదని, అది ఒక విప్లవమని, తెలంగాణ అస్తిత్వం కోసం మళ్లీ పునరంకితం కావాల్సిన సమయం వచ్చిందని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను విమర్శిస్తూ, కేసీఆర్ నాయకత్వ ప్రాముఖ్యాన్ని హరీశ్‌రావు వివరించారు. నాలుగు కోట్ల గొంతులను ఏకం చేసిన ధిక్కార వేదిక బీఆర్ఎస్ అని, ఉద్యమ తెలంగాణను ఉజ్వల తెలంగాణగా తీర్చిదిద్దిందని కొనియాడారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమం అడుగంటిందని, అరాచకం తాండవిస్తోందని ఆరోపించారు. ప్రజల గుండెల్లో ఇప్పుడు 'రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలి' అనే నినాదం మార్మోగుతోందని తెలిపారు. నిలిచిపోయిన తెలంగాణ ప్రగతి రథం మళ్లీ పరుగులు తీసే రోజు దగ్గరలోనే ఉందని, గులాబీ జెండా సగర్వంగా మళ్లీ ఎగురుతుందని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

# త్వరలోనే తెలంగాణలో సర్ ప్రక్రియ

## - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్27 (ప్రజా వీక్షణం)

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న ప్రత్యేక సమగ్ర సవరణ సర్ పక్రియను భారత ఎన్నికల సంఘం నిర్వహించనున్నదని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం త్వరలో విడుదల చేయనుంది. చట్టం ప్రకారం ఓటర్ల జాబితాను సవరించడానికి భారత ఎన్నికల సంఘానికి అధికారాలు ఉన్నాయి. ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఎన్నికకు ముందు లేదా అవసరాన్ని బట్టి సవరణ చేయాలని కమిషన్ ఆదేశిస్తుంది. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో తరచూ జరిగే వలసల వల్ల ఓటర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేరు నమోదు చేసుకోవడం, మరణించిన ఓటర్ల పేర్లు తొలగించకపోవడం వల్ల పలు సమస్యలు ఏర్పడ్డాయన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ఈ ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియను భారత ఎన్నికల సంఘం చేపట్టిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ఓటర్ల జాబితాలో నమోదైన ఓటర్ల వివరాలను 2002లో జరిగిన చివరి సవరణద్వారా ఉన్న వారి పేర్లు లేదా వారి బంధువుల పేర్లతో సరిపోల్చే పక్రియను నిర్వహిస్తున్నారు. ఈ వివరాలను ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేయాలి. ఓటర్లు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ఎంపిక ద్వారా తెలుసుకోవచ్చు. పోలింగ్ స్టేషన్ వారీగా ఓటర్ల జాబితా రూపంలో కూడా అందుబాటులో ఉంది. తమ పోలింగ్ స్టేషన్ తెలిసిన వారు కూడా తమ పేర్లను తనిఖీ చేసుకోవచ్చు. ఇక ఓటరు పేరు 2002 ఎన్నికల జాబితాలో కనపడకపోతే, అతను/ఆమె ఆ సమయంలో నమోదు కాలేదని అర్థం. అటువంటి సందర్భంలో, వారి తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల వివరాలను వెతికి, వాటిని ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేసుకోవాలని సూచించారు. 2002 ఓటర్ల జాబితా ముద్రిత ప్రతులు బూత్ లెవెల్ ఆఫీసర్ వద్ద అందుబాటులో ఉంటాయని, వారు మీకు సహాయం చేస్తారని తెలిపారు. ఎన్యుమరేషన్ దశలో ఓటర్లు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. అయితే, 2002 జాబితాతో సరిపోల్చలేని ఓటర్లకు నోటీసులు జారీ చేయబడతాయన్నారు. వారి అర్హతను నిరూపించడానికి పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

# ధోనీ రికార్డును అధిగమించిన రింకూ సింగ్





ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ స్టార్ ఫినిషర్ రింకూ సింగ్ తన బ్యాట్‌తో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన పోరులో రింకూ సింగ్ అసాధారణ ఇన్నింగ్స్ ఆడి ఏకంగా మహేంద్ర సింగ్ ధోనీ పేరిట ఉన్న 15 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 51 బంతుల్లోనే 7 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 83 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కష్టాల్లో ఉన్న జట్టును సునీల్ నరైన్ తో కలిసి ఆదుకున్న రింకూ, కోల్‌కతా స్కోరును 150 మార్కు దాటించడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ చరిత్రలో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా రింకూ సింగ్ ఇప్పుడు అగ్రస్థానానికి చేరుకున్నాడు. గతంలో ఈ రికార్డు ఎంఎస్ ధోనీ పేరిట ఉండేది. 2011లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ధోనీ ఆరో స్థానంలో వచ్చి 40 బంతుల్లో 70 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. సరిగ్గా 15 ఏళ్ల తర్వాత రింకూ సింగ్ 83 పరుగులతో ఆ రికార్డును తుడిచిపెట్టేశాడు. రింకూ నిలకడైన ఆటతీరు, ప్రెజర్ లో కూడా సిక్సర్లు బాదగలిగే సామర్థ్యం కేకేఆర్ జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్ గా మారింది. ఒకవైపు రింకూ సింగ్ రికార్డుతో క్రికెట్ ఫ్యాన్స్ ఖుషీ అవుతుంటే, మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు కోలుకోలేని వార్త అందింది. ఎంఎస్ ధోనీ ఐపీఎల్ 2026 సీజన్ లో ఆడే విషయంలో ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. వార్మప్ మ్యాచ్ సమయంలో ధోనీకి కాలి కండరాల గాయం తిరగబెట్టడంతో అతను మైదానంలోకి అడుగుపెట్టడం మరింత ఆలస్యం కానుంది. ఈ విషయాన్ని చెన్నై హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ అధికారికంగా ధృవీకరించాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు సీఎస్‌కే ఆడిన ఎనిమిది మ్యాచ్‌లకు ధోనీ దూరంగా ఉన్నాడు. ధోనీ ఆడటానికి చాలా ఆసక్తిగా ఉన్నాడని, కానీ కాలి గాయం చాలా ఇబ్బంది పెడుతోందని ఫ్లెమింగ్ తెలిపాడు. ఒకవేళ కోలుకోకముందే అతను మైదానంలోకి దిగి మళ్ళీ గాయం పెద్దదైతే ఇక ఈ సీజన్ కే దూరం కావాల్సి వస్తుందని, అందుకే తాము చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నాడు. ఒక వార్మప్ గేమ్ లో ప్రాక్టీస్ చేస్తుండగా మళ్ళీ నొప్పి మొదలైందని, ప్రస్తుతం అతను టీమ్ ఫిజియోలతో కలిసి వర్క్ చేస్తున్నాడని తెలిపాడు. అంతా సవ్యంగా జరిగితేనే అతను తుది జట్టులోకి వస్తాడని, ప్రస్తుతానికి మాత్రం అతని రాకపై క్లారిటీ లేదని ఫ్లెమింగ్ మీడియా సమావేశంలో వివరించాడు. ముంబై ఇండియన్స్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌కు ముందు చెన్నై జట్టుకు ఐదు రోజుల విరామం లభించింది. ఈ సమయంలో ధోనీ కోలుకుంటాడని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రాక్టీస్ సెషన్లలో ధోనీ వికెట్ కీపింగ్ డ్రిల్స్ చేస్తూ కనిపించడం చూసి, అతను త్వరలోనే వస్తాడని అందరూ అనుకున్నారు. కానీ ఫ్లెమింగ్ ఇచ్చిన తాజా అప్‌డేట్ ప్రకారం ధోనీ రీఎంట్రీ ఇప్పుడప్పుడే ఉండేలా కనిపించడం లేదు. రింకూ రికార్డుతో కేకేఆర్ పండగ చేసుకుంటుంటే, ధోనీ లేని లోటుతో సీఎస్‌కే శిబిరం ఆలోచనలో పడింది.



# సూర్యవంశీ ఆటపై పాకిస్తాన్ క్రికెటర్ల విస్మయం!

ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ తన అసాధారణ ప్రతిభతో దుమ్మురేపుతున్నాడు. 15ఏళ్ల ప్రాయంలోనే అంతర్జాతీయ బౌలర్లను ఉతికి ఆరేస్తున్నాడు. దీన్ని చూసిన పాకిస్తాన్ క్రికెట్ పండితులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అతని ఒంట్లో ఏఐ చిప్ ఉందేమో, ల్యాబ్‌లో టెస్టులు చేయాలని అంటున్నారు. భారత?లో క్రికెట్ అనేది కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు. అది ఒక భావోద్వేగం. అందుకే ఏటా జరిగే ఐపీఎల్‌కు అంత క్రేజ్ ఉంటుంది. ఈ ఐపీఎల్‌లో ఎందరో యువ ఆటగాళ్లు తమ సత్తా చాటుకుంటున్నారు. అలాంటి వారిలో ఒకడు సూర్యవంశీ. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న 15 ఏళ్ల బుడ్డోడు ప్రస్తుతం క్రికెట్ ప్రపంచానికి ప్రశ్నగా మారాడు. ప్రపంచ స్థాయి బౌలర్లను సైతం బెంబేలెత్తిస్తున్న అతని బ్యాటింగ్ శైలి, ఇప్పుడు పాకిస్థాన్‌లోని క్రికెట్ దిగ్గజాలను కూడా ఆశ్చర్యపరుస్తోంది. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్‌లో సూర్యవంశీ అత్యంత భయంకరమైన బ్యాటర్‌గా మారాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అతను చూపిస్తున్న పరిణతి, ఆత్మవిశ్వాసం అమోఘం. ఇప్పటి వరకు ఆడిన 8 మ్యాచ్‌లలో 357 పరుగులు సాధించి, ఆరెంజ్ క్యాప్ రేసులో రెండో స్థానంలో ఉన్నాడు. అతనిస్ట్రైక్ రేట్ 234 కంటే ఎక్కువగా ఉంది. ఇప్పటికే ఒక సెంచరీ సాధించాడు. ఐపీఎల్ 2026 ప్రారంభం నుంచే తన బ్యాట్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. సాధారణంగా 15-16 ఏళ్ల వయసులో క్రీడాకారులు శరీర ఆకృతి ఇప్పుడిప్పుడే మారుతుంటుంది. కానీ వైభవ్ మాత్రం ఎక్స్‌పీరియన్స్,? ఆటగాడిలా భారీ సిక్సర్స్ బాదుతున్నాడు. పాకిస్థాన్ క్రికెట్ నిపుణుడు నౌమాన్ నియాజ్ ఒక షోలో మాట్లాడుతూ... వాడా డోపింగ్ పరీక్షలు చేస్తున్నట్టు వైభవ్ సూర్యవంశీని ఏదైనా ల్యాబ్‌కు పంపించి పరీక్షించాలి. బహుశా అతని శరీరంలో ఏదైనా ఏఐ చిప్ అమర్చి ఉండొచ్చు. అతను మనిషిలా అనిపించడం లేదు" అని చమత్కరించాడు. సూర్యవంశీ బ్యాటింగ్‌లో పవర్ కంటే అతని టెక్నిక్, రిస్ట్ వర్క్ కీలక పాత్ర పోషిస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. బంతిని స్టేడియం వెలుపలకు పంపే అతని ఆర్క్ అద్భుతంగా ఉందని నౌమాన్ నియాజ్ ప్రశంసించాడు. వైభవ్ సూర్యవంశీ ప్రదర్శనను ప్రత్యేకంగా మార్చిన కొన్ని అంశాలు ఉన్నాయి. అతను పుట్టే నాటికి విరాట్ కోహ్లీ ప్రపంచ ఛాంపియన్‌గా ఎదిగాడు. అటువంటి దిగ్గజాల గురించి తెలుసుకునేలోపే అదే స్థాయిలో రాణించడం సామాన్య విషయం కాదు. 18 ఏళ్లు వచ్చే వరకు శరీరంలో హార్మోన్ల మార్పులు జరుగుతుంటాయి.

# ప్రపంచ రికార్డుకు 11 పరుగుల దూరంలో కోహ్లీ



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టుకు విరాట్ కోహ్లీ మొదటి నుంచి వెన్నెముకగా నిలిచాడు. ఈ స్టార్ బ్యాటర్ ఇప్పుడు మరో అద్భుతమైన రికార్డుకు చేరువలో ఉన్నాడు. నేడు అనగా ఏప్రిల్ 27న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ)తో జరగనున్న మ్యాచ్‌లో.. ఐపీఎల్ చరిత్రలో ఇంతవరకు ఎవరూ సాధించని ఘనతను కోహ్లీ అందుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. విరాట్ కోహ్లీ ప్రస్తుతం ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన వారి జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. అతను నేడు జరిగే మ్యాచ్‌లో కేవలం 11 పరుగులు చేస్తే.. ఐపీఎల్ చరిత్రలో 9,000 పరుగులు పూర్తి చేసిన ప్రపంచంలోనే మొదటి బ్యాట్స్‌మన్‌గా నిలుస్తాడు. ఇప్పటివరకు 274 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన కోహ్లీ, 39.95 సగటుతో 8,989 పరుగులు సాధించాడు. ఇందులో 8 అద్భుతమైన సెంచరీలు, 66 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్ పరుగుల రేసులో ప్రస్తుతం కోహ్లీకి ఎవరూ సాటిలేరు. రెండో స్థానంలో ఉన్న రోహిత్ శర్మ, 276 మ్యాచ్‌లలో 7,183 పరుగులు సాధించాడు. అంటే కోహ్లీ, రోహిత్‌ల మధ్య 1,800 పరుగులకు పైగా భారీగా గ్యాప్ ఉంది. ఈ లీగ్‌లో ఇప్పటివరకు ఏ ఇతర బ్యాట్స్‌మెన్ కూడా 8,000 పరుగుల మార్కును దాటకపోవడం కోహ్లీ ఆధిపత్యానికి నిదర్శనం. ప్రస్తుతం జరుగుతున్న 2026 ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అతను కేవలం 7 మ్యాచ్‌లలోనే 54.57 సగటుతో 328 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో ముందున్నాడు. అతను ఇప్పటికే తన బ్యాట్‌తో 36 ఫోర్లు, 12 సిక్సర్లు బాది ప్రత్యర్థి బౌలర్లకు ముచ్చెమటలు పట్టిస్తున్నాడు. ఇక్కడి ప్రత్యేకత ఏమిటంటే, నేటి మ్యాచ్ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరుగుతోంది. ఇది విరాట్ కోహ్లీ పెరిగిన సొంత మైదానం. ఇక్కడి పిచ్, ఫీల్డ్‌లోని ప్రతి మూల గురించి అతనికి క్షుణ్ణంగా తెలుసు. గత సీజన్‌లో ఢిల్లీలో ఆర్సీబీ తరఫున అద్భుతమైన ప్రదర్శన చేసిన కోహ్లీ, ఈరోజు కూడా జట్టుకు విజయాన్ని అందించేందుకు ఒక పెద్ద ఇన్నింగ్స్ ఆడతానని ధీమాతో ఉన్నాడు. ఐపీఎల్‌లో 9,000 పరుగులు చేసిన తొలి బ్యాట్స్‌మన్‌గా నిలిచే అవకాశం. విరాట్ 274 మ్యాచ్‌లలో 8,989 పరుగులు చేశాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక సెంచరీలు (8) సాధించాడు. తమ అభిమాన ఆటగాడు ఈ అరుదైన మైలురాయిని చేరుకుని, జట్టును ప్లే-ఆఫ్స్‌కు చేర్చాలని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులు ఆశిస్తున్నారు.

# అరుదైన రీతిలో అవుటైన రఘువంశీ



క్రికెట్ మైదానంలో బ్యాటర్లు క్లీన్ బౌల్డ్ అవ్వడం లేదా క్యాచ్ ఇచ్చి అవుట్ అవ్వడం మనం ఎప్పుడూ చూస్తుంటాం. కానీ ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటర్ అంగ్ క్రిష్ రఘువంశీ ఎవరూ ఊహించని విధంగా అవుటై అందరినీ ఆశ్చర్యపరిచాడు. క్రికెట్ లోనే అత్యంత అరుదైన అబ్ స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' రూపంలో అతను పెవిలియన్ చేరాడు. ఐపీఎల్ సుదీర్ఘ చరిత్రలో ఇలా అవుటైన నాలుగో ప్లేయర్‌గా రఘువంశీ నిలిచాడు. విశేషం ఏంటంటే ఇలా అవుటైన నలుగురూ భారతీయులే కావడం గమనార్హం. కేకేఆర్ ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో ప్రిన్స్ యాదవ్ వేసిన ఆఖరి బంతిని రఘువంశీ మిడ్-ఆన్ వైపు నెట్టి సింగిల్ కోసం పరుగెత్తాడు. అయితే నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న కామరూన్ గ్రీన్ అతన్ని వెనక్కి వెళ్ళమని వారించాడు. దీంతో రఘువంశీ మళ్ళీ తన క్రీజులోకి రావడానికి వెనక్కి తిరిగాడు. సరిగ్గా అదే సమయంలో మహమ్మద్ షమీ విసిరిన త్రో నేరుగా స్టంప్స్ వైపు వస్తోంది. రఘువంశీ క్రీజులోకి డైవ్ చేసే క్రమంలో పిచ్ మీద ఉన్న 'డేంజర్ జోన్' లోకి రావడమే కాకుండా, షమీ విసిరిన బంతికి అడ్డంగా వచ్చాడు. ఆ బంతి నేరుగా రఘువంశీ శరీరానికి తగిలింది. షమీ అండ్ టీమ్ అప్పీల్ చేయడంతో థర్డ్ అంపైర్ రోహిత్ పండిట్ వీడియోను పరిశీలించి రఘువంశీని అవుట్‌గా ప్రకటించాడు. ఈ నిర్ణయంతో 9 పరుగుల వద్దే అతను వెనుదిరగాల్సి వచ్చింది. డగౌట్ వద్ద కేకేఆర్ కోచ్ అభిషేక్ నాయర్ అంపైర్లతో వాదించగా, రఘువంశీ అసహనంతో తన హెల్మెట్‌ను విసిరేసి నిరాశ వ్యక్తం చేశాడు. ఐసీసీ రూల్స్ ప్రకారం.. వికెట్ల మధ్య పరుగెత్తే సమయంలో ఒక బ్యాటర్ ఉద్దేశపూర్వకంగా తన దిశను మార్చుకుని, ఫీల్డర్ వేసే త్రో స్టంప్స్ కు తగలకుండా అడ్డుపడితే దాన్ని 'అబ్స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' గా పరిగణిస్తారు. ఇక్కడ బంతి స్టంప్స్ కు తగిలే అవకాశం ఉందా లేదా అనేది ముఖ్యం కాదు, బ్యాటర్ కావాలనే తన రన్నింగ్ పాత్ మార్చుకున్నాడని అంపైర్ భావిస్తే అవుట్ ఇవ్వొచ్చు. పిచ్ మధ్యలో ఉండే సున్నితమైన ప్రాంతాన్ని బ్యాటర్ క్రాస్ చేసినా ఈ నిబంధన వర్తిస్తుంది.ఐపీఎల్ చరిత్రలో ఈ అరుదైన అవుట్ కు బలైన మొదటి ఆటగాడు యూసుఫ్ పఠాన్. 2013లో ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పఠాన్ బంతిని తొక్కేస్తూ పరుగెత్తడంతో అంపైర్లు అవుట్ ఇచ్చారు. ఆ తర్వాత 2019 సన్ రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడిన అమిత్ మిశ్రా, బంతి విసిరే సమయంలో తన రన్నింగ్ రూట్ మార్చి ఈ రకంగా అవుటయ్యాడు. ఇక మూడవ ప్లేయర్‌గా టీమ్ ఇండియా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా నిలిచాడు. 2024 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్ విసిరిన త్రోకు అడ్డంగా రావడంతో జడేజాను అంపైర్లు అవుట్‌గా ప్రకటించారు. తాజాగా రఘువంశీ కూడా ఈ జాబితాలో చేరడంతో ఐపీఎల్ లో ఈ రూల్ మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఫీల్డింగ్ చేసే జట్టు అప్పీల్ చేసినప్పుడు మాత్రమే అంపైర్లు దీనిపై స్పందిస్తారు. కేకేఆర్ కేవలం 27 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న సమయంలో రఘువంశీ ఇలా అవుట్ అవ్వడం ఆ జట్టును కోలుకోలేని దెబ్బ తీసింది.

# రింకు సింపుల్ మ్యాన్..



కోల్?కతా నైట్?రైడర్స్ స్టార్ బ్యాటర్ రింకు సింగ్ చాలా రోజుల తర్వాత కీలక ఇన్నింగ్స్?తో అదరగొట్టాడు. తాజాగా ఎకానా స్టేడియం వేదికగా లఖ్?నవూ సూపర్ జెయింట్స్?తో జరిగిన మ్యాచ్?లో అద్భుతమైన బ్యాటింగ్, ఫీల్డింగ్?తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. చివరి బంతి దాకా క్రీజులో ఉండి, జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించాడు. దీంతో అతడికి మ్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అయితే మ్యాచ్ అనంతరం రింకు సింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ? అవార్డ్ ప్రజెంటేషన్ సమయంలో 'నువ్వు జట్టు కష్టాల్లో ఉన్న ప్రతీసారి ఆదుకుంటావు కాదా. అందుకే నీ పేరును అపద్బాంధవుడు రింకు అని మార్చమంటారా?' అని అడిగారు. దీనికి రింకు నవ్వుతూ 'వద్దు వద్దు, రింకు పేరే ఉండనివ్వండి. అదే బాగుంది' అని రిప్లై ఇచ్చాడు. దీనికి నెటిజన్లు అతడని ప్రశంసిస్తున్నారు. రింకు సింపుల్ మ్యాన్ అని కామెంట్లు పెడుతున్నారు. అయితే మ్యాచ్?లో రింకు బ్యాటింగ్?కు వచ్చే సమయానికి జట్టు 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లోఉంది. దీంతో భారీ షాట్లకు పోకుండా స్కోర్ బోర్డును ముందుకు నడిపించడంపైనే దృష్టి పెట్టినట్లు రింకు చెప్పాడు. ఎలాగైనా చివరి బంతి దాకా క్రీజులో ఉండాలని భావించినట్లు తెలిపాడు. చెత్త బంతులను మాత్రమే బౌండరీలకు తరలించాలనుకున్నట్లు వివరించాడు. వాస్తవానికి కేకేఆర్ ఇన్నింగ్స్ ప్రారంభమైన తీరు- ముగిసిన విధానానికి చాలా తేడా ఉంది.

ప్రజావీక్షణం
దినపత్రిక

# ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్ సాయిపల్లవి కాదు కాదు...రుక్మిణీ వసంత్



జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి రూపొందించబోతున్న సంగీత సామ్రాజ్ఞి ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో సాయిపల్లవి నటించబోతోందనే వార్త కొంతకాలంగా మీడియాలో చక్కర్లు కొడుతోంది. అలానే ఆమె పేరుతో పాటు నయనతార పేరు కూడా ఆ మధ్య వినిపించింది. అలా మరో ఇద్దరు ముగ్గురి పేర్లనూ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రతో ముడి పెట్టి కొందరు ప్రచారం చేశారు. అయితే ఫైనల్‌గా సాయిపల్లవి దగ్గరే అది ఆగింది. కానీ ఇప్పుడు ఆ పాత్ర సాయి పల్లవి చేజారి... రుక్మిణీ వసంత్ ను చేరిందని వార్తలు వస్తున్నాయి. సాయిపల్లవికి ఈ పాత్ర చేయాలనే కోరిక బలంగా ఉన్నా... ఇప్పటికే ఆమె కమిట్ అయిన సినిమాల కారణంగా డేట్స్ అడ్జస్ట్ చేయలేక ఈ పాత్రను వదిలేసుకుందని అంటున్నారు. ఇదిలా ఉంటే... పలు కన్నడ, తెలుగు సినిమాలతో ఇప్పటికే దక్షిణాది సినీ అభిమానుల గుండెల్లో చోటు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో నటిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'కాంతార: చాప్టర్ 1'తో రుక్మిణీ వసంత్ సైతం జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె యశ్ మూవీ 'టాక్సిక్'లో నటిస్తోంది. అలానే ప్రభాస్ సరసన 'డ్రాగన్' చేస్తోంది. తమిళంలోనూ ధనుష్ మూవీలో రుక్మిణీ వసంత్ ఎంపికైందని వార్తలు వచ్చాయి. కెరీర్ మంచి ఊపు మీద ఉన్న ఈ సమయంలో ఆమె ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రను చేస్తే ఖచ్చితంగా అది ప్రాజెక్ట్‌కు ఉపయోగపడే అంశమే! అయితే రుక్మిణీ వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగా నటించబోతోందనే విషయాన్ని ఇంకా అధికారికంగా మేకర్స్ ప్రకటించలేదు.



## కార్తీతో బోయపాటి మూవీ చిత్రపరిశ్రమలో పుకార్ల షికారు


టాలీవుడ్‌లో 'మాస్ సినిమాల చిరునామా'గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బోయపాటి శ్రీను, స్క్రీన్ మీద హీరోని ఎంత పవర్‌ఫుల్‌గా చూపించవచ్చో, విలన్‌ను ఎంత భయంకరంగా సృష్టించవచ్చో.. బోయపాటి సినిమాలను చూస్తే అర్థమవుతుంది. కేవలం ఫైట్లు, రక్తం మాత్రమే కాకుండా, ప్రేక్షకుడి నరాల్లో రక్తం ఉడికేలా చేసే హై-వోల్టేజ్ ఎలివేషన్లు ఆయన సొంతం. ఒక సాధారణ కథను కూడా తనదైన మేకింగ్ స్టైల్‌తో వెండితెరపై ఒక విజువల్ వండర్‌గా మార్చడంలో ఆయన దిట్ట. మొదటి సినిమా నుండి మొన్నటి 'అఖండ-2' వరకు ఆయన ఎంచుకునే యాక్షన్ సీక్వెన్స్, డైలాగ్ డెలివరీలో ఒక ప్రత్యేకమైన 'బోయపాటి మార్క్' స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, అఖండ-2 తర్వాత ఆయన ఎవరితో జతకట్టబోతున్నారనే విషయంపై గత కొద్ది రోజులుగా ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. మొదట ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో సరైనోడు-2 సినిమా ఉంటుందని ప్రచారం జరిగినప్పటికీ, వివిధ కారణాల వల్ల అది పట్టాలెక్క లేదు. ఆ తర్వాత బాలీవుడ్ హీరోలతో సినిమా ఉంటుందని వార్తలు వచ్చినా, అవి కేవలం పుకార్లుగానే మిగిలిపోయాయి. తాజాగా, కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ పేరు తెరపైకి రావడంతో సినీ ప్రియుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. తెలుగు, తమిళ భాషల్లో మంచి ఫ్యాన్ బేస్ ఉన్న హీరో కార్తీ కి మాస్ యాక్షన్ సినిమాలంటే మక్కువ ఎక్కువే. మరోవైపు బోయపాటి శ్రీను తనదైన శైలిలో హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట. వీరిద్దరి కలయికలో సినిమా వస్తుందనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో 'టాక్ ఆఫ్ ది టౌన్'గా మారింది. కార్తీ ఇమేజ్‌కు సరిపడే పక్కా మాస్ కథను బోయపాటి ఇప్పటికే సిద్ధం చేశారని, ఈ ప్రాజెక్ట్ గనుక ఓకే అయితే సౌత్ ఇండియాలో ఇదొక భారీ క్రేజీ కాంబినేషన్ అవుతుందని ఇన్‌సైడ్ టాక్ వినిపిస్తోంది. సాధారణంగా బోయపాటి సినిమాల్లో హీరోల ఎలివేషన్స్, యాక్షన్ సీక్వెన్స్ పీక్స్‌లో ఉంటాయి. కార్తీ కూడా ప్రయోగాత్మక సినిమాలతో పాటు కమర్షియల్ ఎంటర్‌టైనర్లలో తనదైన ముద్ర వేశారు. తెలుగు మార్కెట్‌పై పట్టు పెంచుకుంటున్న కార్తీకి, బోయపాటి మాస్ ఇమేజ్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయం అని అంటున్నారు.






## జూన్ 25న పెద్ది విడుదల ఖాయం దర్శకుడు సానా బుచ్చిబాబు వెల్లడి

రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం విడుదలపై క్లారిటీ వచ్చింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఫైనల్‌గా జూన్ 25న విడుదల కానుందని రెండ్రోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే! అయితే దీనిపై దర్శకుడు సాన బుచ్చిబాబు క్లారిటీ ఇచ్చారు. ధనుష్ హీరోగా నటించిన 'కర' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆయన అతిథిగా హాజరయ్యారు. అక్కడ 'పెద్ది రిలీజ్ ఎప్పుడు అని అభిమానులు గోల చేయగా బుచ్చి విడుదల తేదిని ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లో జూన్ 25 సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని తెలిపారు. దీంతో అభిమానులు కాస్త ఊరట చెందారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో క్రీడా నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన రెండు పాటలు దుమ్ము లేపేశాయి. త్వరలో ఓ డ్యూయెట్ రానుంది. ఆ తర్వాత శ్రుతీహాసన్, రామ్‌చరణ్‌పై చిత్రీకరిస్తున్న ప్రత్యేక గీతాన్ని విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. షూటింగ్ ఆలస్య, పోస్ట్ ప్రొడక్షన్ పనులు సమయం సరిపోకపోవడం వల్ల విడుదల వాయిదా పడిన సంగతి తెలిసిందే.




## ధనుష్‌తో మరోమారు వెంకీ అట్లూరి జత

తమిళ నటుడు ధనుష్‌తో 'సార్' సినిమా తీసి విజయం అందుకున్నారు తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య బంధం బలపడింది. ధనుష్ నటించిన ఏ సినిమా తెలుగులో విడుదలైనా వెంకీ అట్లూరి ప్రమోషన్స్‌లో భాగమవుతున్నారు. 'సార్' కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. ఈ రూమర్స్ నిజమేనని స్పష్టమైంది. హైదరాబాద్‌లో జరిగిన 'కర' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వెంకీ అట్లూరి గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుష్ వెంకీని ఉద్దేశించి మాట్లాడుతూ 'చివరి నిమిషంలో పిలిచినా వచ్చినందుకు థ్యాంక్స్. మీరు నాకు బ్రదర్‌లాంటివారు. 'సార్' లాంటి మంచి చిత్రాన్ని నాకు ఇచ్చారు. 'సార్' తర్వాత మీరో కథ నెరేట్ చేసి.. అదృశ్యమయ్యారు. ఆ కథను సంపూర్ణంగా తీసుకురండి. సినిమా చేయడానికి నేను రెడీగా ఉన్నా. మీ సక్సెస్‌కు చాలా ఆనందిస్తున్నా. మీ గత చిత్రం 'లక్కీ భాస్కర్' చాలా నచ్చింది. మీ రాబోయే సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' కు కూడా శుభాకాంక్షలు' అని అన్నారు. ధనుష్ నటించిన 'కర' సినిమా ఈ నెల 30న విడుదల కానుంది.






## శరవేగంగా కల్కి-2 షూటింగ్ తమిళ నటుడు శింబు కూడా చేరినట్లు ప్రచారం

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసి వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. పురాణాల ఆధారంగా భవిష్యత్ నేపథ్యంలో సాగిన ఈ సినిమా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'కల్కి 2'ను మరింత భారీ స్థాయిలో తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. కథను మరింత లోతుగా, భావోద్వేగపూర్వకంగా తీర్చిదిద్దేందుకు దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. మొదటి భాగంలో చూపించిన ప్రపంచాన్ని విస్తరించి, కొత్త పాత్రలు, ఆసక్తికరమైన మలుపులతో సీక్వెల్‌ను రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు. తాజాగా వినిపిస్తున్న వార్తల ప్రకారం ఈ సీక్వెల్‌లో ఒక పవర్‌ఫుల్ స్పెషల్ పాత్ర ఉండబోతుందని, అది క్లైమాక్స్‌లో కీలకంగా మారుతుందని టాక్. ఆ పాత్ర కోసం తమిళ స్టార్ హీరో శింబును సంప్రదించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఈ సినిమాలో నటిస్తే తమిళ మార్కెట్‌లో సినిమాకు మరింత బలం చేకూరే అవకాశముందని అంటున్నారు. మొదటి భాగం చివర్లో ప్రభాస్ పాత్రను కర్ణుడిగా చూపిస్తూ మేకర్స్ ఇచ్చిన ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. దీంతో సీక్వెల్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈసారి కథ ప్రధానంగా కర్ణుడి గతం, అతని గాథ, తిరిగి రావడం వంటి అంశాలపై నడుస్తుందని సమాచారం. బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆయన మళ్లీ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com